www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -79 శుక్రవారం 3 జులై 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545



## వీబీజీరాంజీతో గ్రామాభివృద్ధి

**ఆంధ్రప్రదేశ్ వేదికగా అమలులోకి**

**- తొలి కార్యక్రమంగా ఫారం పాండ్ కి శంకుస్థాపన చేసిన కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**





**రైల్వే కోడూరు జూలై 02 ,,(ప్రజావినికిడి):**
వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ్‌చట్టం ఆంధ్రప్రదేశ్ వేదికగా జాతీయ స్థాయిలో అమలులోకి వచ్చింది. తిరుపతి జిల్లా, రైల్వే కోడూరు నియోజకవర్గం పరిధిలోని ముక్కావారిపల్లెలో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ గారు, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, గౌరవ ఉప ముఖ్యమంత్రివర్యులు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి చేతుల మీదుగా ఫారం పాండ్ కు శుంకుస్థాపన చేసి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. వీబీ జీ రాం జీ చట్టంలో గ్రామీణాభివృద్ధి, గ్రామీణ ప్రజల అభివృద్ధితోపాటు రైతుల కోసం ప్రత్యేక కార్యాచరణ ఉంటుందని తెలిసేలా ఈ పంట కుంట తవ్వకం పనులకు శ్రీకారం చుట్టారు. **మిగతా 2లో...**

## వీబీజీరాంజీ లో చేరుతున్నాం

**సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు**

- అభ్యంతరాలపై సుప్రీంకు వెళ్తాం
- స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లో బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం
- టీచర్లు, సిబ్బందికి కూడా అక్కడే భోజనాలు
- కొత్త సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో 6,278 పోస్టులకు ఆమోదం
- 'మూసీ' ఫేజ్‘1కు త్వరలో టెండర్లు.. దానికోసం
- రూ.7345 కోట్లకు పరిపాలనా అనుమతులు
- గోదాములు, 'జవహర్ నవోదయ' కోసం భూముల కేటాయింపులు




## రెండు, మూడు నెలల్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం

- అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు స్థిరంగా కొనసాగడమే ఇందుకు కీలకం
- పాత నిల్వలు అధిక ధరకు కొన్నందున కంపెనీలకు భారీ నష్టాలు
- ఇప్పటికే పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 తగ్గించిన నయారా ఎనర్జీ



2లో.

## సీఎం రక్షణ వల్లే దోషులు తప్పించుకుంటున్నారు

**ఆత్మహత్య చేసుకున్న దళిత యువకుడు క్రాంతి కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన జగన్**

**పోలీసు వేధింపుల వల్లే క్రాంతి మృతి చెందాడని ఆరోపణ**

**విజయవాడజూలై 02 ,(ప్రజావినికిడి):**
విజయవాడలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న దళిత యువకుడు క్రాంతి కుమార్ కుటుంబాన్ని వైసీపీ అధినేత జగన్ గురువారం పరామర్శించారు. క్రాంతి కుమార్ భార్య, పిల్లలు, తండ్రిని ఓదార్చిన జగన్, వారికి న్యాయం జరిగే వరకు తమ పార్టీ అండగా నిలిచి పోరాడుతుందని భరోసా ఇచ్చారు. **మిగతా 2లో...**



## ఇండో పసిఫిక్‌లో శాంతి, భద్రతే ఉమ్మడి లక్ష్యం

**భారత్, జపాన్ బంధం మరింత బలోపేతం -జపాన్ ప్రధాని సనాయె తకాయిచి**

**ఢిల్లీలో మోడీతో ద్వైపాక్షిక సమావేశం -ఇరుదేశాల మధ్య పలు కీలక అవగాహనా ఒప్పందాలు**

**న్యూఢిలీజూలై 02 , ,(ప్రజావినికిడి):**
భారత్, జపాన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగులు పడ్డాయి. భారత ప్రధాని మోడీ ఆహ్వానం మేరకు మూడు రోజుల అధికారిక పర్యటన కోసం భారత్‌కు వచ్చిన జపాన్ ప్రధాని సనాయె తకాయిచి గురువారం ఢిల్లీలో ప్రధాని మోడీతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. అనంతరం ఇరు దేశాల మధ్య పలు కీలక అవగాహనా ఒప్పందాలు**మిగతా 2లో...**



## కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

**మాటల యుద్ధంతో వేడెక్కిన రాజకీయం**

- అధికార, ప్రతిపక్ష నేతల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు
- గన్‌పార్క్ వద్దకు వచ్చిన మంత్రులు జూపల్లి, : పొన్నం, అడ్లూరి, అజహరుద్దీన్
- తెలంగాణ భవన్ వద్ద తీవ్ర ఉద్రిక్తత గన్‌పార్క్‌కు వెళ్లేందుకు బీఆర్ఎస్ నేతల యత్నం
- హరీశ్‌రావు సహా పలువురి నాయకుల అరెస్టు

**హైదరాబాద్జూలై 02 , ,(ప్రజావినికిడి):**
రాష్ట్రంలో రాజకీయం వేడెక్కింది. అధికార, ప్రతిపక్ష నేతల సవాళ్లు, ప్రతిసవాళ్లతో హైదరాబాద్ నగరం అట్టుడికింది. నాయకుల మధ్య మాటల యుద్ధం నేపథ్యంలో గురువారం హైటెన్షన్ వాతావరణం నెలకొంది. రాష్ట్ర అప్పు, గురుకుల విద్యాసంస్థల**మిగతా 2లో...**



## బోడుప్పల్‌లో భూపోరాటానికి దిగిన కవిత

**అడ్డుకుని అరెస్ట్ చేసిన పోలీసులు**




**హైదరాబాద్,జూలై 02 , ,(ప్రజావినికిడి):**
తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవితను బోడుప్పల్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని బోడుప్పల్‌లో భూ పోరాటానికి టీఆర్ఎస్ సిద్ధమైంది. ఇందులో భాగంగా బోడుప్పల్ చేరుకుని **మిగతా 2లో...**



## స్పీడ్ పోస్ట్ ద్వారా గంజాయి

**హైదరాబాద్ పోలీసుల ఆపరేషన్‌లో గుర్తింపు**

**వివరాలు వెల్లడించిన నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్**

**హైదరాబాద్,, ,(ప్రజావినికిడి):** దేశవ్యాప్తంగా స్పీడ్ పోస్ట్ ద్వారా గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను అరెస్ట్ చేశామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. రైళ్లు, విమానాల ద్వారా వచ్చిన స్పీడ్ పోస్ట్ పార్సిళ్లకు స్కానింగ్ లేకపోవడంతో సరఫరా సులభమైందన్నారు. దీంతో ఇక పోస్టల్ పార్సిళ్లకు తప్పనిసరి స్కానింగ్ అమలు చేయాలని కేంద్ర శాఖలకు లేఖ రాయనున్నట్లు తెలిపారు. ఎస్ఆర్ నగర్, గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పార్సిల్‌పై అనుమానం కలిగి దర్యాప్తు చేశామని.. హైదరాబాద్‌కు వచ్చిన 2 పార్సిల్స్ ఫ్లైట్‌లోనే వచ్చాయన్నారు. నగరంలోని అన్ని కొరియర్ సంస్థలకు ప్రతి పార్సిల్‌ను తప్పనిసరిగా స్కాన్ చేయాలని ఆదేశాలు జారీ చేస్తొన్నారు. అనుమానాస్పద పార్సిళ్లు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. **మిగతా 2లో...**

# వీబీజీరాంజీతో గ్రామాభివృద్ధి

**మొదటిపేజీ తరువాయి**

పంచాయతీపాలనలో ఆంధ్రప్రదేశ్ అద్భుత విజయాలు అనంతరం వీబీ జీ రాం జీ పథకం కింద కలప ఉత్పత్తి చేసే టేకు, మద్ది, వేప, యూకలిప్టస్ తదితర 10 రకాల మొక్కలను శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ గారు, శ్రీ చంద్రబాబు నాయుడు గారు, శ్రీ పవన్ కళ్యాణ్ గారు, ఇతర కేంద్ర, రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా నాటారు. పచ్చదనం పెంపుతో పర్యావరణ పరిరక్షణతోపాటు పంచాయతీల ఆదాయం పెంచేందుకు శ్రీ పవన్ కళ్యాణ్ గారు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణలో కలప ఉత్పత్తి, వుడ్ బ్యాంకుల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అందుకు సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రివర్యులకు తెలియజేశారు. అనంతరం సభా ప్రాంగణానికి సమీపంలో ఏర్పాటు చేసిన మ్యాజిక్ డ్రెయిన్ నమూనాను చూపించి ఆ కాన్సెప్ట్ ను శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ గారికి వివరించారు. మురుగునీటి నిర్వహణలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తీసుకువచ్చిన వినూత్న ఆవిష్కరణ అయిన ఈ మ్యాజిక్ డ్రెయిన్ మొత్తం మూడు లేయర్లలో నిర్మాణాన్ని ప్రదర్శించారు. మ్యాజిక్ డ్రెయిన్లలో ఎర్త్ వర్క్, మొదటి



లేయర్ లో 30 సెంటీమీటర్ల మందంతో వేసిన 100 ఎంఎం కంకర, రెండో లేయర్ లో వేసిన 40 ఎంఎం కంకర, మూడో లేయర్ లో వేసిన 20 ఎంఎం కంకరతో నింపనున్నట్టు తెలిపారు. మ్యాజిక్ డ్రెయిన్ పని తీరుని వివరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సాధించిన విజయాల సమాహారంతో ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీని తిలకించారు. మోడల్ పంచాయతీలు, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ పంచాయతీలు, జియో ట్యాగింగ్ వంటి పారదర్శక విధానాలతో సాధించిన ప్రగతిని అతిధులంతా వీక్షించారు. అనంతరం వేదిక మీద ఏర్పాటు చేసిన వీబీ జీ రాంజీ శిలాఫలకాన్ని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ గారు ఆవిష్కరించారు. లబ్ధిదారులైన ఉపాధి శ్రామికులకు వీబీ జీ రాం జీ కార్డులు పంపిణీ చేశారు. అనంతరం శ్రీ పవన్ కళ్యాణ్ గారి చేతుల మీదుగా ఓపీఈడీ బుక్ లెట్ ను ఆవిష్కరించారు. పోర్టల్ ను శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ గారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి శ్రీ కమలేష్ పాశ్వాన్ గారు, సమాచార ప్రసార, గ్రామీణాభివృద్ధి శాఖల సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ గారు, రాష్ట్ర మంత్రులు శ్రీ సత్యకుమార్ యాదవ్ గారు, శ్రీ అనగాని సత్యప్రసాద్ గారు, రైల్వే కోడూరు శాసన సభ్యులు శ్రీ అరవ శ్రీధర్ గారు, కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి శ్రీ రోహిత్ కన్సాల్ గారు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ కాంతిలాల్ దండే గారు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ శ్రీ కృష్ణ తేజ గారు, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

**మొదటిపేజీ తరువాయి**

టెండర్లలో అవినీతి అంశాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటలు తీవ్ర దుమారం రేపాయి. రైతాంగానికి ప్రభుత్వం చేసిన సంక్షేమంపై చర్చకు సిద్ధమా? అని సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరిన విషయం తెలిసిందే. ఆ సవాల్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వీకరించారు. తాను చర్చకు సిద్ధమనీ, స్థలం, తేదీ చెప్పాలని ప్రతి సవాల్ విసిరారు. రాష్ట్ర అప్పు రూ.3.50 లక్షల కోట్లని ప్రకటించారు. దీనిపై స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు రాష్ట్ర అప్పులపై గణాంకాలతో సహా చెప్పేందుకు బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌కు గురువారం ఉదయం 11 గంటలకు వస్తానని అన్నారు. ఇంకోవైపు గురుకుల విద్యాసంస్థల టెండర్లలో రూ.రెండు వేల కోట్ల కుంభకోణం జరిగిందంటూ మాజీమంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు.

దీన్ని సవాల్ చేస్తూ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, అజహరుద్దీన్ గురువారం ఉదయం 10 గంటలకే గన్‌పార్క్ వద్దకు చేరుకున్నారు. ఇదే సమయంలో తెలంగాణ భవన్‌కు కేటీఆర్, హరీశ్‌రావు వచ్చారు. అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ గురుకుల విద్యాసంస్థల టెండర్లలో ఎలాంటి అవినీతి జరగలేదన్నారు. పూర్తి వివరాలతో ఇక్కడికి వచ్చామని చెప్పారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కాకుండా మాజీమంత్రి హరీశ్‌రావు గన్‌పార్క్ వద్దకు రావాలని సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను స్వీకరించిన హరీశ్‌రావు గన్‌పార్క్ వద్దకు వచ్చేందుకు యత్నించారు. కారులో కూర్చొగానే పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మంత్రులేమో రమ్మంటారు, పోలీసులేమో గన్‌పార్క్ వద్దకు వెళ్లకుండా అడ్డుకున్నారని హరీశ్‌రావు విమర్శించారు. అదే సమయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజహరుద్దీన్‌లకు ఆయన ఫోన్ చేశారు. వారు లిఫ్ట్ చేయకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. కారులో వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు చెప్పడంతో దిగి నడుకుంటూ వెళ్లేందుకు యత్నించారు.

దీంతో పోలీసులు హరీశ్‌రావు, ఇతర నాయకులను అడ్డుకుని అరెస్టు చేశారు. కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు



తరలించారు. హరీశ్‌రావును మాజీమంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, పి సబితా ఇంద్రారెడ్డి పరామర్శించారు. ఇంకోవైపు మంత్రి జూపల్లి కృష్ణారావు కోసం తెలంగాణ భవన్ వద్ద కేటీఆర్ వేచి చూశారు. అయితే జూపల్లి కృష్ణారావు గన్‌పార్క్ వద్దకు వెళ్లారు. గన్‌పార్క్ వద్దకు రావాలని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను స్వీకరించిన కేటీఆర్ అక్కడికి వెళ్లేందుకు యత్నించారు. దీంతో పోలీసులు ఆయన్ను అడ్డుకున్నారు. నా మాటలకు కట్టుబడి ఉన్నా : జూపల్లికేసీఆర్ హయాంలో రాష్ట్ర అప్పులపై తన మాటలకు కట్టుబడి ఉన్నానని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పు రూ.7.30 లక్షల కోట్లని వివరించారు. ఈ అప్పునకు సంబంధించిన గణాంకాలు తప్పని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని ప్రకటించారు. గురుకుల టెండర్లలో అవినీతి జరగలేదు : అడ్లూరి, పొన్నంగురుకుల విద్యాసంస్థల టెండర్లలో అవినీతి జరగలేదని మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్ అన్నారు.

అవినీతి జరిగినట్టు నిరూపిస్తే దేనికైనా రెడీ, అవసరమైతే మంత్రి పదవులకు రాజీనామా చేస్తామని చెప్పారు. నిబంధనల ప్రకారమే టెండర్ల ప్రక్రియను అధికారులు నిర్వహించారని వివరించారు. దీన్ని నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అధికారిక కార్యక్రమాల్లో ఉండగా ఫోన్ కాల్‌కు స్పందించలేదనీ, పిరికివాళ్లమని అనడం హాస్యాస్పదమని చెప్పారు. సీఎంకు దమ్ముంటే అసెంబ్లీ సమావేశాలు పెట్టాలి : కేటీఆర్ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు తొడగొట్టి తోకముడిచారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు కోసం తెలంగాణ భవన్‌లో కుర్చీ వేసి మూడు గంటలు వేచి చూసినా రాకుండా పారిపోయారని విమర్శించారు. తాము గన్‌పార్క్ వెళ్లకుండా పోలీసులతో అడ్డుకుని డ్రామాలు ఆడారని అన్నారు. తమతో చర్చించే దమ్ము వారికి లేదన్నారు. హరీశ్‌రావు, ఇతర నేతల్ని అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమస్యలపై చర్చించే దమ్ముంటే వెంటనే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలను పెట్టాలని డిమాండ్ చేశారు. డైవర్షన్ పాలిటిక్స్‌ను ప్రజలు సహించబోరని అన్నారు. జూపల్లి రాజీనామా చేయాలి : హరీశ్‌రావుఈ ప్రభుత్వం సవాళ్లు చేసి చివరకు తోకముడిచిందని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు.

మంత్రులు గోల్ కొడతామనుకుని సెల్ఫ్ గోల్ కొట్టుకున్నారని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో మంత్రి జూపల్లి కృష్ణారావు రూ.ఎనిమిది లక్షల కోట్ల అప్పు అయ్యిందని ఆరోపిస్తూ తెలంగాణ భవన్‌కు వస్తానని సవాల్ విసిరారని అన్నారు. కేటీఆర్, తాను తెలంగాణ భవన్‌లో ఉంటే చర్చకు రాలేదన్నారు. పాలమూరు పౌరుషం ఉంటే జూపల్లి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిన్న రూ.ఎనిమిది లక్షల కోట్లనీ, ఇప్పుడు రూ.ఏడు లక్షల కోట్ల అప్పు అంటున్నారని విమర్శించారు. గురుకుల టెండర్లలో అవకతవకలు జరిగాయన్నారు. అవినీతి చేసినందుకే పోలీసులను అడ్డుపెట్టుకుని మంత్రులు తప్పించుకున్నారని అన్నారు. కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ వద్ద మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సర్కారు నడవడం లేదనీ, సర్కర్ నడుపుతున్నారని విమర్శించారు.

# వీబీజీరాంజీ లో చేరుతున్నాం

## సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు

**హైదరాబాద్, జూలై 02 , ,(ప్రజావినికిడి):** తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు మొదటి దశకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.7,345కోట్లతో మొదటి దశ పనులు చేపట్టనున్నారు. టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో 6,278 పోస్టుల మంజూరుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. రాష్ట్రంలో వీబీ జీరామ్‌జీ పథకాన్ని అమలు చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. దీనికి సంబంధించిన అభ్యంతరాలపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయం తీసుకుంది. కేబినేట్ వివరాలను మంత్రులు పొంగులేటి , సీతక్కలు వివరించారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా తొలగించారని మండిపడ్డారు. దీని స్థానంలో విబిజిరామ్ పథకం తేవడం దుర్మార్గమని అన్నారు. విధిలేని పరిస్థితిలో దీనిని ఆమోదిస్తూనే, దీనిపై న్యాయపోరాటం చేయాలని కేబినేట్ నిర్ణయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను సంప్రదించకుండా ఏకపక్షంగా అమల్లోకి తెచ్చిన 'వీబీ జీ రామ్ జీ' చట్టంపై రాష్ట్ర మంత్రివర్గం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ కొత్త చట్టం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని, ఇది ఫెడరల్ , రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని కేబినెట్ సబ్ కమిటీ చేసిన సిఫారసులపై చర్చించారు. ఉపాధి హామీ పథకంలో ఎలాంటి మార్పులు చేయవద్దని గత జనవరిలోనే అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, మరోసారి కేంద్రానికి నిరసన తెలపాలని నిర్ణయించారు. అయితే, ఇతర రాష్ట్రాలన్నీ దీనికి ఆమోదం తెలపడం, ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలనే ఉద్దేశంతో గత్యంతరం లేని పరిస్థితిలో ఈ చట్టాన్ని జులై 1 నుంచి రాష్ట్రంలో అమలు చేసేందుకు నోటిఫికేషన్ జారీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. కానీ, ఈ నిబంధనలపై సుప్రంకోర్టులో న్యాయపోరాటం చేయాలని, పార్లమెంట్‌లోనూ కేంద్రాన్ని నిలదీయాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు అందించే అల్పాహారం, పాలు , మధ్యాహ్న భోజనాన్ని ఇకపై వారితో పాటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఇతర సిబ్బందికి కూడా అందించాలని కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందించే సంకల్పంతో పాటు, భోజన వితరణలో జవాబుదారీతనం పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల రాష్ట్రంలో దాదాపు లక్షన్నర మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, పాఠశాల సిబ్బందికి ప్రయోజనం చేకూరనుంది. కొత్తగా అందుబాటులోకి వస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో భారీ ఎత్తున నియామకాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. సనత్ నగర్, ఎల్.బి.నగర్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రులతో పాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా మొత్తం 6,278 డాక్టర్లు, వైద్య సిబ్బంది పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో 1,494 రెగ్యులర్ పోస్టులు, 549 కాంట్రాక్ట్ పోస్టులు, 4,235 ఔట్ సోర్సింగ్ పోస్టులు ఉన్నాయి. ఈ ఆసుపత్రులను నిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని, ఇక్కడ అందించే వైద్య సేవలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు కూడా ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఫేజ్-ఎ పనులకు మంత్రివర్గం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. తొలి దశలో హిమాయత్ సాగర్ నుంచి ఈసా, ఉస్మాన్ సాగర్ నుంచి మూసా ప్రవాహాలు ప్రారంభమయ్యే చోటు నుంచి బాపూఘాట్ వరకు 21 కిలోమీటర్ల పొడవునా అభివృద్ధి పనుల కోసం రూ. 7,345.12 కోట్ల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు పనులు , నిర్వహణ కోసం నూతనంగా 147 పోస్టుల సృష్టికి, అలాగే ఇతర శాఖల నుంచి అవసరమైన సిబ్బందిని డిప్యూటేషన్‌పై తీసుకునేందుకు అంగీకారం తెలిపారు. నిత్యావసర వస్తువుల గోదాముల నిర్మాణానికి గాను తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు మార్కెట్ రేటు ప్రకారం భూములను కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బొల్లికుంట గ్రామంలో 50 ఎకరాలు, రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం కర్కాలపహాడ్ గ్రామంలో 10 ఎకరాల భూమిని కేటాయించనున్నారు. రాష్ట్రంలో విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థలకు స్థలాలను కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు కోసం మహబూబ్‌నగర్ జిల్లా పెద్దాయిపల్లి గ్రామంలో 20.18 ఎకరాలు, సూర్యాపేట జిల్లా కోదాడలో 19.12 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. అలాగే, జగిత్యాల జిల్లా చల్‌గల్ గ్రామంలో కొత్తగా కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని మంత్రివర్గం తీర్మానించింది.

గోదాములు, విద్యాలయాలు, సంస్థల నిర్మాణం కోసం స్థలాలు కేటాయించాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో పాటు 1.50 లక్షల మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సిబ్బందికి కూడా అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనం అందించాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఉపాధ్యాయ సంఘాల నుంచి, సిబ్బంది నుంచి ప్రభుత్వానికి అందిన విజ్ఞప్తులను పరిశీలించిన ముఖ్యమంత్రి మరియు మంత్రివర్గం దీనిపై సానుకూలంగా స్పందించింది. ఉపాధ్యాయులు మరియు స్కూల్ సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు, ఒత్తిడి లేకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ నిర్ణయం ఎంతో దోహదపడుతుందని క్యాబినెట్ అభిప్రాయపడింది. తాజాగా జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రతిపాదనకు అధికారికంగా ఆమోద ముద్ర వేశారు. విద్యార్థులతో పాటు ఒకే పంక్తిలో ఉపాధ్యాయులు కూడా భోజనం చేయడం వల్ల పాఠశాలల్లో సమానత్వం పెంపొందడమే కాకుండా, భోజనం నాణ్యతను నిరంతరం పర్యవేక్షించడానికి వీలవుతుందని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

## సీఎం రక్షణ వల్లే దోషులు తప్పించుకుంటున్నారు

**మొదటిపేజీ తరువాయి**

అనంతరం మీడియాతో మాట్లాడిన జగన్.. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందనడానికి క్రాంతి కుమార్ ఆత్మహత్యే నిదర్శనమని అన్నారు. "ఆత్మహత్య చేసుకునే ముందు క్రాంతి కుమార్ స్వయంగా సెల్ఫీ వీడియో తీసి, సీఐ నాగరాజు, ఇతర పోలీసుల వేధింపుల గురించి వివరించారు. అయినా ఇంతవరకు బాధ్యులపై చర్యలు తీసుకోలేదు" అని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఎనిమిదేళ్ల క్రితం నమోదైన చిన్న కేసుల కోసం గత మూడు నెలలుగా రోజూ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వేధించడం వల్లే అతను ప్రాణాలు తీసుకున్నాడని ఆరోపించారు.

ముఖ్యమంత్రి నివాసానికి, డీజీపీ, హోంమంత్రి కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఈ ఘటన జరిగిందని జగన్ అన్నారు. "సీఐని కమిషనర్, కమిషనర్‌ను డీజీపీ, డీజీపీని ముఖ్యమంత్రి కాపాడుతున్నారు. ఇది ఒక ప్రొటెక్షన్ రాకెట్‌లా నడుస్తోంది" అని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు.

ఈ ఘటనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదు చేయకపోవడం దారుణమన్నారు. క్రాంతి కుమార్ కుటుంబానికి న్యాయపరమైన సహాయంతో సహా అన్ని విధాలా అండగా ఉంటామని జగన్ స్పష్టం చేశారు.

## ఇండో పసిఫిక్‌లో శాంతి, భద్రతే ఉమ్మడి లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

జరిగాయి. ఈ సందర్భంగా జపాన్ ప్రధాని సనాయె తకాయిచి మాట్లాడుతూ స్వేచ్ఛాయుత, సుసంపన్నమైన, నిబంధనల ఆధారిత ఇండో-పసిఫిక్ ప్రాంత నిర్మాణం భారత్, జపాన్ ఉమ్మడి లక్ష్యమని స్పష్టం చేశారు. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, అభివృద్ధికి దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్, జపాన్ కూడా ఉన్నాయని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, మార్కెట్ ఆర్థిక వ్యవస్థలను విశ్వసించే దేశాలుగా రెండు దేశాలు కలిసి అనేక కీలక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాయని చెప్పారు. ఈ కార్యక్రమాల ద్వారా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రత, ఆర్థిక పురోగతి మరింత బలపడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రధాని మోడీ తనను 'అందమైన చెల్లెలు'గా సంబోధించడం సంతోషంగా అనిపించిందని తకాయిచి చెప్పారు. భారత్‌తో జపాన్‌కు ఉన్న ప్రత్యేక సంబంధాలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయని అన్నారు. ఇటీవల తాము నవీకరించిన "ఫ్రీ అండ్ ఓపెన్ ఇండో-పసిఫిక్" ( ఎఫ్ ఓఐపీ) విధానానికి అనుగుణంగా భారత్‌తో వ్యూహాత్మక సహకారాన్ని మరింత విస్తరించేందుకు అంగీకరించినట్లు వెల్లడించారు. రక్షణ రంగంలోనూ ఇరు దేశాల మధ్య సహకారం మరింత పెరగనుందని జపాన్ ప్రధాని తకాయిచి తెలిపారు. జపాన్ రక్షణ దళాలు, భారత నౌకాదళం కలిసి సంయుక్త విన్యాసాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే ఈ ఏడాది ముగిసేలోపు భారత్- జపాన్ విదేశాంగ, రక్షణ మంత్రుల 2+2 సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ)లో భారత్ సభ్యత్వానికి జపాన్ మద్దతు కొనసాగుతుందని కూడా ఆమె స్పష్టం చేశారు. ఈ పర్యటనలో భాగంగా పలు కీలక రంగాల్లో అవగాహనా ఒప్పందాలు కుదిరాయి. భారత భూగర్భ సర్వే సంస్థ, జపాన్ ఆర్గనైజేషన్ ఫర్ మెటల్స్ అండ్ ఎనర్జీ సెక్యూరిటీ మధ్య భూగర్భ శాస్త్రం, కీలక ఖనిజాల అన్వేషణలో సహకారానికి సంబంధించి అవగాహనా ఒప్పందంపై సంతకాలు జరిగాయి. భవిష్యత్ అవసరాలకు కీలకమైన ఖనిజ వనరుల గుర్తింపు, అన్వేషణలో ఈ ఒప్పందం ఉపయోగపడనుంది. అదే విధంగా ఔషధాలు, వైద్య పరికరాల రంగంలో సహకారం పెంపునకు మరో అవగాహన ఒప్పందం కుదిరింది. అలాగే భారత భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ, జపాన్ ఆర్థిక, వాణిజ్య, పరిశ్రమల శాఖల మధ్య బ్యాటరీల తయారీ, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి సంబంధించి మరో ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఎలక్ట్రిక్ వాహనాల విస్తరణ, స్వచ్ఛ ఇంధన రంగానికి ఇవి దోహదపడనున్నాయి. ఇక సహకార మంత్రిత్వ శాఖ, పశుసంవర్ధక శాఖలతో కలిసి బయోగ్యాస్, సేంద్రీయ ఎరువుల ఉత్పత్తి, వినియోగాన్ని విస్తరించేందుకూ అవగాహనా ఒప్పందం కుదిరింది

## రెండు, మూడు నెలల్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం

**న్యూఢిల్లీ జూలై 02 , ,(ప్రజావినికిడి):**

వాహనదారులకు ఊరటనిచ్చేలా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి కీలక సంకేతాలిచ్చారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ప్రస్తుత స్థాయిలోనే స్థిరంగా కొనసాగితే, రాబోయే రెండు, మూడు నెలల్లో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం ఉందని ఆయన గురువారం వెల్లడించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ముడిచమురు ధరలు గరిష్ఠంగా ఉన్న సమయంలో కొనుగోలు చేసిన నిల్వలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రస్తుతం వినియోగిస్తున్నాయని మంత్రి వివరించారు. దీనివల్ల జూన్ 30 నాటికి ప్రభుత్వ రంగ చమురు సంస్థలు పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ విక్రయాలపై సుమారు రూ. 74,781 కోట్ల మేర నష్టాలను చవిచూశాయని పేర్కొన్నారు. ధరల తగ్గింపుపై ఇప్పుడే వ్యాఖ్యానించడం తొందరపాటే అవుతుందని, అదంతా ముడిచమురు ధరల స్థిరత్వంపైనే ఆధారపడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

ఇదిలావుండగా, ప్రైవేట్ రంగ ఇంధన రిటైలర్ 'నయారా ఎనర్జీ' జూలై 1 నుంచి తన అవుట్‌లెట్లలో లీటరు పెట్రోల్‌పై రూ. 5, డీజిల్‌పై రూ. 3 చొప్పున తగ్గించింది. గత రెండేళ్ల కాలంలో చమురు ధరలు తగ్గడం ఇదే తొలిసారి. అలాగే, వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల ధరలను సైతం రూ. 183.50 మేర తగ్గించగా, గృహ వినియోగ సిలిండర్ల ధరల్లో మాత్రం ఎటువంటి మార్పు లేదు. గత నాలుగేళ్లలో భారత్‌లో పెట్రోల్ ధరలు కేవలం 5.58 శాతం, డీజిల్ ధరలు 6.23 శాతం మేర మాత్రమే పెరిగాయని, అదే సమయంలో అభివృద్ధి చెందిన దేశాల్లో 20 శాతం, పొరుగు దేశాల్లో 35 శాతం వరకు పెరిగాయని మంత్రి గుర్తు చేశారు. అంతర్జాతీయంగా తీవ్ర ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకం తగ్గించి ప్రజలపై భారం పడకుండా చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 102.12, డీజిల్ ధర రూ. 95.20 వద్ద స్థిరంగా కొనసాగుతోంది.

## బోడుప్పల్‌లో భూపోరాటానికి దిగిన కవిత

**మొదటిపేజీ తరువాయి**

భూ పోరాటం చేస్తున్న కవితను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో టీఆర్ఎస్ కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. తోపులాట చోటు చేసుకోవడంతో కవితతో పాటు టీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఉప్పల్‌లో ఈరోజు తెలంగాణ ఉద్యమకారులు, మహిళల రక్తం చిందిందని కవిత అన్నారు. బొల్లారం పీఎస్ వద్ద టీఆర్ఎస్ చీఫ్ మాట్లాడుతూ.. మహిళలు, తెలంగాణ ఉద్యమకారులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీఛార్జ్ చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను మాత్రమే అడిగాం తప్ప వేరే డిమాండ్లు ఏమీ అడగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నేటి నుంచి కౌంట్‌డౌన్ స్టార్ట్ అయ్యిందన్నారు. ఉద్యమకారులకు వాళ్లు ఇస్తామన్న 250 గజాల స్థలం ఇవ్వాలని మాత్రమే అడిగామని తెలిపారు. కచ్చితంగా ఉద్యమకారులకు ఇస్తామన్న హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అడిగితే ఉద్యమకారులపై లాఠీఛార్జ్ చేసి రక్తం చిందేలా కొట్టడం అన్యాయమన్నారు. ఉద్యమకారులకు ఇస్తామన్న హామీలను ఈ ప్రభుత్వానికి రోజూ గుర్తు చేస్తూనే ఉంటామని కవిత స్పష్టం చేశారు.

# స్పీడ్ పోస్ట్ ద్వారా గంజాయి

**మొదటిపేజీ తరువాయి**

గురువారం మీడియాతో మాట్లాడుతూ.. అధికారులు, గుడిమల్కపూర్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి నిందితుల్ని అరెస్ట్ చేశారన్నారు. గంజాయిను స్పీడ్ పోస్ట్ ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నారని.. జార్ఖండ్‌కు చెందిన సత్యం మిశ్రాను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇంటర్ చదివిన సత్యం మిశ్రా పెయింట్ పని చేసి మానేశాడని.. ఆ తర్వాత లారీ డ్రైవర్‌గా పనిచేశాడన్నారు. 2018లో గంజాయికి అలవాటు పడ్డ మిశ్రా.. రాహుల్ జై, సచిన్ మిశ్రా, సంతోష్‌తో సిండికేట్‌గా ఏర్పడి.. సొంత ఊరిలోనే గంజాయి పంట వేశారని తెలిపారు. ఊరిలో చాలా మందితో గంజాయి పంట పండించి కొనుగోలు చేసి కస్టమర్లకు సరఫరా చేస్తున్నారని చెప్పారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారన్నారు. స్పీడ్ పోస్ట్, కొరియర్ సేవల ద్వారా 21 రాష్ట్రాలకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్, ముంబై, చెన్నై, ఢిల్లీ, బెంగళూరు సహా పలు నగరాలకు గంజాయి సరఫరా చేస్తున్నారని సజ్జనార్ తెలిపారు. పార్శిళ్లలో మందులు ఉన్నట్లు తప్పుడు డిక్లరేషన్ ఇచ్చి పోస్టల్ అధికారులను మోసగిస్తున్నారని.. ఇస్రీ బజార్, ఫుర్సో పోస్టాఫీసుల నుంచి స్పీడ్ పోస్ట్ ద్వారా పార్శిళ్లు బుక్ చేసినట్లు గుర్తించామన్నారు. వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ఆర్డర్లు తీసుకుని జఖఎ ద్వారా నగదు లావాదేవీలు జరిగేవన్నారు. రోజుకు 80 -100 ఆర్డర్లు వస్తుండగా.. అందులో 8 నుంచి 10 వరకు స్పీడ్ పోస్ట్ పార్శిళ్ల ద్వారా గంజాయి పంపిణీ చేస్తున్నారన్నారు. ఒక్కో పార్శిల్‌లో 50 - 250 గ్రాముల గంజాయి ఉంచుతూ డెలివరీ చేస్తున్నారని.. ఒక్కో ప్యాకెట్ రూ.1,500 నుంచి రూ.8,000 వరకూ విక్రయిస్తున్నట్లు తెలిపారు. రోజుకు సుమారు రూ.1 లక్ష ఆదాయం లభించగా.. నెలకు రూ.30 లక్షల నుంచి రూ.35 లక్షలు, ఏడాదికి రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల టర్నోవర్ ఉందన్నారు. సరఫరాదారులు, కస్టమర్స్ మధ్య కోడ్స్ ద్వారా ఆన్‌లైన్ బుకింగ్ జరుగుతుందని తెలిపారు. వాట్సాప్‌లో వివిధ కోడ్స్ ద్వారా కస్టమర్స్ గంజాయి ఆర్డర్ చేస్తున్నారని అన్నారు. వచ్చిన డబ్బుతో నిందితులు బంగారం, లగ్జరీ వాహనాలు కొనుగోలు చేశారని సీపీ వెల్లడించారు. నిందితులు పలు బ్యాంక్ ఖాతాలు, ఐడీలతో మనీలాండరింగ్ చేసినట్లు గుర్తించామన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
శుక్రవారం 3 జులై 2026

# బీఆర్ఎస్ లో ఉన్నది దొరలు కాదు.. దొంగలు..

**మీ తండ్రి ఓ బ్రోకర్.. మీరిద్దరూ జోకర్లు.. - నీచెల్లి..నీ అవినీతి గురించి చెప్పినా మీకు సిగ్గులేదు..**




- అవినీతికి పాల్పడి అడ్డగోలుగా రాష్ట్రాన్ని దోచారు..
- కెసిఆర్ భోజనాలకే రూ. 995 కోట్లు
- మీ తండ్రి కుంభకర్ణుడు.. మీరు బకాసురులు..
- స్కీంలు పెట్టి.. స్కామ్ లు చేయడమే లక్ష్యం..
- బకాయిలతో రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి పోయారు..
- అప్పులు తీర్చడానికి సీఎం నానా కష్టాలు పడుతున్నారు..
- ఇంత చేస్తున్న సిగ్గు లేకుండా విమర్శలా..?
- మీ అవినీతికి శ్రీకృష్ణ జన్మస్థానం తప్పదు..
- బీఆర్ఎస్ అగ్రనేతలపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ధ్వజం..





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ఏ శాఖలో చూసినా బకాయిలే..ఎక్కడ చూసినా అప్పులే.. గతాన్ని తవ్వితే అన్ని అక్రమాలే.. ఎమ్మెల్యేలు, నాయకులు మొదలుకొని ఆనాటి సీఎం దాకా అందరూ అవినీతిపరులే..
నీ తండ్రి భోజనాలకే తొమ్మిదిన్నర ఏళ్లలో రూ.995 కోట్లు ఖర్చు చేశారు.ప్రజల సొమ్మును కుంభకర్ణుడిలా మీ తండ్రి, బకాసురుల్లా మీరు (కేటీఆర్,హరీష్) చేసిన పాపాలను నీ చెల్లి కవిత బట్టబయలు చేయలేదా.. అలాంటి మీకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించే అర్హత ఉందా.. ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు ఉందా.. అని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ “వీర్లపల్లి శంకర్“ ఘాటుగా విమర్శించారు. షాద్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాల భ్రష్టు పట్టించిందని విమర్శించారు. గత ప్రభుత్వాలన్నీ కలిపి ఉమ్మడి రాష్ట్రంలో 68 వేల కోట్ల అప్పులు చేస్తే,ఒక్క బీఆర్ఎస్ హయాంలోనే 8 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి తెలంగాణను నిలువునా ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు.మీ తండ్రి ఒకప్పుడు బ్రోకర్ గా,మీరు జోకర్లుగా మారిన నాయకులు అంటూ కేటీఆర్ హరీష్ రావులను ఉతికి ఆరేశారు. మా ముఖ్యమంత్రిని మీరు విమర్శించడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఆ పార్టీ చేసిన అవినీతిని చూసి ప్రజలు కాలగర్భంలో కలిపేసినప్పటికీ ఇంకా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రైతుబిడ్డగా సీఎం రేవంత్ రెడ్డి అందరికీ న్యాయం చేసేలా పాలన కొనసాగిస్తుంటే అది చూసి ఓర్వలేక పోతున్నారని అన్నారు.

### బకాయిల పార్టీ..

బీఆర్ఎస్ అధికారాన్ని వీడియో ముందు ప్రతి శాఖలోనూ బకాయిలను వదిలించి వెళ్లిపోయిందని పేర్కొన్నారు.ఫీజు రియంబర్స్మెంట్, డిస్కం లు, గ్రామీణ పంచాయతీలకు నిధులు,సివిల్ సప్లై,అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లు,ఆర్టీసీ, మధ్యాహ్న భోజనం ఇలా ప్రతి చోట బకాయిలు పెట్టి డబ్బులను అడ్డంగా దోచుకుపోయారని ఆరోపించారు. ఇవన్నీ ప్రజలకు తెలుసని ఆయన అన్నారు.లక్ష ఎకరాలకు సాగునీరు, దళితుడే ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాల భూమి వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యారంగంలో ఎన్నో మార్పులు తీసుకువస్తుంటే కేజీ టు పీజీ అంటూ హడావిడి చేసి అటకెక్కించిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు చేసిన దందాలు, భూ కబ్జాలు అన్నీ తెలుసని అన్నారు.షాద్ నగర్ నియోజకవర్గాన్ని తీసుకుంటే ఇక్కడ హడావిడిగా కేటీఆర్ డబల్ బెడ్ రూంలు ప్రారంభించాడే తప్ప పనులన్నీ అసంపూర్తిగా వదిలేశారని, తాము వచ్చాకే 10 కోట్లు మంజూరు చేసి పనులు చేయించామని గుర్తు చేశారు. అధికారం పోయింది అన్న అక్కసుతో ఇలా మాట్లాడుతున్నారని,అయినప్పటికీ సీఎం కక్ష సాధించకుండా కేవలం ప్రజాస్వామ్య విధానంలో పాలన కొనసాగిస్తున్నారని ప్రశంసించారు.


### అవినీతికి అంతం ఎక్కడ..?

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో అవినీతికి అంతే లేకుండా పోయిందని విమర్శించారు. కాళేశ్వరం కుంభకోణం,ఢిల్లీ లిక్కర్స్ స్కాం, ఫార్ములా ఈ కార్ రేస్ కుంభకోణం, దళిత బందులో అవినీతి, రైతుబంధులో అక్రమాలు,గొర్రెల పంపిణీ స్కీమ్లో దోపిడీ,ఏ మాత్రమే కాకుండా రేషన్ బియ్యం, ఇసుక రవాణా, విద్యుత్ కొనుగోలు,డబల్ బెడ్ రూం,విదేశీ చదువులు,ధరణి, ఓఆర్ఆర్ టెండర్,బతుకమ్మ చీరలు,మిషన్ కాకతీయ, హరితహారం, మార్భొడ్ మొక్కల కొనుగోలు,పత్తి కొనుగోలు ఇలా ప్రతి చోట కుంభకోణాలు చేసిన చరిత్ర బి ఆర్ ఎస్ సొంతమని అన్నారు.ధరణి కుంభకోణం ద్వారా కోట్ల రూపాయల విలువైన భూములను తెలంగాణ వ్యాప్తంగా ఆక్రమించారని ఆరోపించారు. ప్రభుత్వం రాదని తెలిసి ఎన్నికలకు ముందే మద్యం టెండర్ల డబ్బులు ఎత్తుకెళ్లిన దొంగలని వ్యాఖ్యానించారు. ఇలాంటి దొంగలు ఈరోజు కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. వీళ్లకు దమ్ముంటే తమ ఎమ్మెల్యేలలో ఎవరు అవినీతికి పాల్పడ్డారో చెప్పాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతి ఎమ్మెల్యే చేసిన అవినీతిని తాము ఆధారాలతో సహా చూపించగలమని స్పష్టం చేశారు. ఇకనైనా మౌనంగా ఉండకపోతే వీళ్ళ బండారాలు బయట పెట్టడం ఖాయమని స్పష్టం చేశారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ అగ్ర నాయకులకు శ్రీకృష్ణ జన్మస్థానం తప్పదని హెచ్చరించారు.ఈ మీడియా సమావేశంలో నేతలు మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, రఘు,పురుషోత్తం రెడ్డి,జితేందర్ రెడ్డి,సుదర్శన్ గౌడ్,నలమోని శ్రీధర్,కృష్ణ, రమేష్,జంగారి రవి,బాబు నాయక్,జంగయ్య తదితరులు పాల్గొన్నారు

# ఆధ్యాత్మిక కార్యక్రమాలతో గ్రామాల్లో ఐక్యత పెరుగుతుంది

## షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
మహేశ్వరం మండలం గట్టుపల్లి గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ గొల్ల కేతమ్మ, భ్రమరాంబ సమేత శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్థంభ ప్రాణ ప్రతిష్ఠ,బొడ్రాయి పండుగ మహోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారు, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, యాదవ సంఘం నాయకులు,గ్రామ ప్రజలను అభినందించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామాల్లో ఐక్యతను, సామరస్యాన్ని పెంపొందించడంతో పాటు సనాతన సంప్రదాయాలను భావితరాలకు చేరవేస్తాయని అన్నారు.గ్రామ ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,యాదవ సంఘం నాయకులు,ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వెల్‌జర్లలో సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమం

**ఓటర్ వెరిఫికేషన్‌ను విజయవంతం చేయాలి - సర్పంచ్ ఆర్. బాబు నాయక్**




**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా ఫరూఖ్‌నగర్ మండలంలోని వెల్‌జర్ల గ్రామంలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, పరిశీలన కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఆర్.బాబు నాయక్,బీఎల్ఏ వట్టెల మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఆర్. బాబు నాయక్ మాట్లాడుతూ, బీఎల్‌వోలు, యూనిట్ సభ్యులు పరస్పర సమన్వయంతో ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. గ్రామంలోని ప్రతి అర్హుడైన ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు.ఓటరు నమోదు, వెరిఫికేషన్ ప్రక్రియ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలకమని పేర్కొన్న ఆయన, ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఏ వట్టెల మహేష్ యాదవ్, జీపీవో విష్ణు, నేతలు కటికెల తిరుపతి యాదవ్, కావాలి నర్సింహులు, కేవీఎం,బీఎల్‌వో కావాలి శమంత తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధాపూర్‌లో ఎకో టౌన్‌కు 86 ఎకరాల భూమి బదిలీకి ప్రభుత్వం ఆమోదం

- **జీవో ఆర్‌టీ నెం. 641 జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం**
- **ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం ఏర్పాటుకు పరిపాలనా అనుమతులు**
- **జపాన్ సహకారంతో ఎకో టౌన్ అభివృద్ధికి ముందడుగు**

**కొత్తూరు,(ప్రజావినికిడి):**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కొత్తూర్ మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో ఎకో టౌన్ ప్రాజెక్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలో ఘన వ్యర్థాల నిర్వహణ (ఎస్‌డబ్ల్యూఎం) సదుపాయాల ఏర్పాటుకు సిద్ధాపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 252, 278,361లోని మొత్తం 86 ఎకరాల భూమిని వినియోగించేందుకు ప్రభుత్వం అధికారికంగా ఆమోదం తెలిపింది.
ఈ మేరకు మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (జీహెచ్‌ఎంసీ-2) శాఖ గురువారం జీవో ఆర్‌టీ నెం. 641ను జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, తెలంగాణ ప్రభుత్వం మరియు జపాన్‌లోని ఫుకూకా ప్రిఫెక్చర్‌లోని కిటాక్యూషు నగరాల మధ్య కుదిరిన స్నేహ, సహకార ఒప్పందంలో భాగంగా సర్క్యులర్ ఎకానమీ అభివృద్ధి, నెట్‌జీరో లక్ష్యాల సాధన కోసం సిద్ధాపూర్‌లో ఎకో టౌన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) ఆధీనంలోని 86 ఎకరాల భూమిని జీహెచ్‌ఎంసీకి ఉచితంగా బదిలీ చేశారు. అనంతరం హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (హైఎంఎస్‌డబ్ల్యూ)కు ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం ఏర్పాటుకు ప్రత్యేక అధికారి (క్యూర్) అనుమతులు మంజూరు చేశారు. ఈ చర్యలను ప్రభుత్వం పరిశీలించి అధికారికంగా ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ప్రాజెక్టు అమలుకు అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.
ఈ ఉత్తర్వులతో సిద్ధాపూర్‌లో ప్రతిపాదిత ఎకో టౌన్,ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం ఏర్పాటుకు పరిపాలనా పరంగా మార్గం సుగమమైంది. అదేవిధంగా ఇక్కడ ఏ కోట వద్దు అంటూ స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్థానిక ప్రజలు ఆయా గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు ఇటీవల శ్రీకారం చుట్టారు అయితే ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో దీనిపై ముందడుగు వేయదని ఎమ్మెల్యే భరోసాతో ఆందోళన విరమించారు ఇప్పుడు కథ మొదటికి రావడంతో ఏం జరుగుతుందో వేచి చూడాలి..



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

METROPOLITAN AREA & URBAN DEVELOPMENT DEPARTMENT - Greater Hyderabad Municipal Corporation (GHMC) – Siddapur Eco-Town Project – Land admeasuring Ac.86.00 in Sy.Nos.252, 278 & 361 of Siddapur Village, Kothur Mandal, Ranga Reddy District transferred to GHMC for establishment of Eco-Town - Ratification of permission accorded by the Special Officer, CURE to M/s.Hyderabad Integrated Municipal Solid Waste Management Limited (HiMSW) for establishment of Solid Waste Management (SWM) facilities – Ratification – Orders – Issued.

METROPOLITAN AREA & URBAN DEVELOPMENT (GHMC.2) DEPARTMENT
G.O.Rt.No. 641 Dated: 02-07-2026
Read the following:-

1) The Commissioner, Greater Hyderabad Municipal Corporation (GHMC), Hyderabad, Lr.No. SWM/ 0002/ 2022/ AE-1 (SWM) HO, Dated:01.08.2025 addressed to the Vice Chairman & Managing Director, Telangana Industrial Infrastructure Corporation Limited (TGIIC).
2) The Special Chief Secretary to Government, Industries & Commerce Department, Lr.No.4325/IP&INF/A2/2025, Dated:05.01.2026 addressed to the Vice Chairman & Managing Director, Telangana Industrial Infrastructure Corporation Limited (TGIIC), Hyderabad.
3) The Special Officer, CURE, Lr.No.SWM/0002/AE-1(SWM)HO/133, Dated: 30.03.2026 addressed to the Project Head, M/s. Hyderabad Integrated Municipal Solid Waste Management Limited (HiMSW), Jawaharnagar.
4) From the Commissioner, Greater Hyderabad Municipal Corporation (GHMC), Hyderabad, Lr.No.SWM/0002/2022/AE-1(SWM)HO, Dated:06.06.2026.

* * *


ORDER:

In the reference 1st read above, the Commissioner, Greater Hyderabad Municipal Corporation (GHMC) has submitted that, a letter Dated:01.08.2025 addressed to the Vice Chairman & Managing Director, Telangana Industrial Infrastructure Corporation Limited (TGIIC) for requesting to transfer of 150 acres of land situated in Survey Nos.252, 278 and 361 of Siddapur Village, Kothur Mandal, Ranga Reddy District, for establishment of an Eco-Town under the Friendship and Co-operation Agreement between the Government of Telangana and the City of Kitakyushu, Fukuoka Prefecture, Japan, with the objective of promoting a Circular Economy and achieving Net Zero goals.

2. Further, the Special Chief Secretary to Government, Industries & Commerce Department, vide letter 2nd read above, permitted the Vice Chairman & Managing Director, Telangana Industrial Infrastructure Corporation Limited (TGIIC), to transfer Ac.86.00 of TGIIC land situated in Survey Nos.252, 278 and 361 of Siddapur Village, Kothur Mandal, Ranga Reddy District, to the Commissioner, Greater Hyderabad Municipal Corporation (GHMC), free of cost, for establishment of the proposed Eco-Town. Accordingly, advance possession of the said land was handed over by Telangana Industrial Infrastructure Corporation Limited (TGIIC) to Greater Hyderabad Municipal Corporation (GHMC) on 11.02.2026 through an Advance Possession Certificate.

3. The Special Officer (CURE), vide letter 3rd read above, accorded permission to M/s. Hyderabad Integrated Municipal Solid Waste Management Limited (HiMSW), to establish the Solid Waste Management (SWM) facility of Greater Hyderabad Municipal Corporation (GHMC) in the said land parcel to an extent of Ac.86.00 located at Siddapur village, in accordance with applicable rules and as per Terms & Conditions of Concession Agreement (CA) of the Integrated Municipal Solid Waste Management (IMSWM) Project and others.

(P.T.O.)



::2::

4. Therefore, the Commissioner, Greater Hyderabad Municipal Corporation (GHMC), Hyderabad has requested the Government to ratify the action taken by the Special Officer, (CURE) in permitting M/s. Hyderabad Integrated Municipal Solid Waste Management Limited (HiMSW), to establish the Solid Waste Management (SWM) facility of Commissioner, Greater Hyderabad Municipal Corporation (GHMC), Hyderabad in the said land parcel to an extent of Ac.86.00 located in Sy. Nos.252, 278 and 361 of Siddapur (V), Kothur (M), Rangareddy (D), in accordance with the applicable Rules, and as per the Terms & Conditions of Concession Agreement of the Integrated Municipal Solid Waste Management (IMSWM) Project and others.

5. Accordingly, Government, after careful examination of the matter, hereby ratify the action taken by the Special Officer, (CURE) in permitting M/s.Hyderabad Integrated Municipal Solid Waste Management Limited (HiMSW) to establish the Solid Waste Management (SWM) facilities of Greater Hyderabad Municipal Corporation (GHMC) over the land admeasuring Ac.86.00 situated in Survey Nos.252, 278 and 361 of Siddapur Village, Kothur Mandal, Ranga Reddy District, in accordance with the applicable Acts, Rules, Government Orders and the Terms and Conditions of the Concession Agreement relating to the Integrated Municipal Solid Waste Management (IMSWM) Project.

6. The Commissioner, Greater Hyderabad Municipal Corporation (GHMC), Hyderabad, shall take further necessary action accordingly.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

JAYESH RANJAN
SPECIAL CHIEF SECRETARY TO GOVERNMENT

To
The Commissioner, Greater Hyderabad Municipal Corporation (GHMC), Hyderabad.
The Vice Chairman & Managing Director, Telangana Industrial Infrastructure Corporation Limited (TGIIC), Hyderabad.
The Managing Director, M/s.Hyderabad Integrated Municipal Solid Waste Management Limited (HiMSW), Hyderabad.
The Special Officer, (CURE), Hyderabad.
The Principal Secretary to Government, Industries & Commerce Department.
The Telangana State Pollution Control Board, Hyderabad.
The Accountant General (A&E), Telangana, Hyderabad.
Sf/Sc.
Copy to:
The Secretary to Hon'ble Chief Minister.
The OSD to Special Chief Secretary to MA&UD Department.
Sf/Sc.

// FORWARDED: BY ORDER //

SECTION OFFICER

# ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందించాలి

**షాద్ నగర్ ఆర్డీఓ ఎన్.ఆర్. సరిత**






**షాద్ నగర్,(ప్రజావినికిడి):**ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా బూర్గుల గ్రామంలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ విధానాన్ని షాద్‌నగర్ ఆర్డీఓ ఎన్.ఆర్.సరిత పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రతి అర్హత కలిగిన ఓటరికి తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం అందించాలని, ఫారాలను తిరిగి స్వీకరించిన అనంతరం వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని బూత్ స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఫరూక్‌నగర్ తహసీల్దార్ నాగయ్యతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వైద్యులకు ఘన సన్మానం..

## డాక్టర్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమం







**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్‌నగర్ పట్టణంలో డాక్టర్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ స్టార్స్ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులను ఘనంగా సన్మానించారు. క్లబ్ నూతన అధ్యక్షుడు మంచిరేవుల అశోక్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి జోన్ చైర్మన్ ఎల్కుర్తి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
మహబూబ్‌నగర్ రోడ్డులోని శారద ఫెర్టిలిటీ సెంటర్ ఆసుపత్రిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ శారద, డాక్టర్ నాగవర్ధన్ రెడ్డి,డాక్టర్ విజయ,డాక్టర్ శ్రీనివాస్,డాక్టర్ చందన,డాక్టర్ కిరణ్,డాక్టర్ అరుణ్,డాక్టర్ కార్తీక్,డాక్టర్ సాజియా తదితర వైద్యులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, సమాజ ఆరోగ్య పరిరక్షణలో వైద్యులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవనివారి సేవలను గుర్తించి సన్మానించడం గర్వకారణమని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రామచందర్, సీనియర్ లయన్స్ సభ్యులు మంచిరేవుల సాయి కృష్ణ,గండు నారాయణ, మల్చలం మురళి, ఆంజనేయులు, నారియా నాయక్, సతీష్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.“లాంగ్ లివ్ లయనిజం“ అంటూ సభ్యులు సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించాలని సంకల్పం వ్యక్తం చేశారు.

# అమర్‌నాథ్ యాత్రకు బయలుదేరిన షాద్‌నగర్ హిందూ వాహిని నాయకులు

**పేద హిందువులకు ఉచిత అమర్‌నాథ్ యాత్ర కల్పించాలని తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**షాద్‌నగర్‌కు చెందిన హిందూ వాహిని నాయకులు, సభ్యులు హిందువుల ఆరాధ్య దైవమైన పరమశివుడి పవిత్ర క్షేత్రం శ్రీ అమర్‌నాథ్ యాత్రకు ఘనంగా బయలుదేరారు. హిమాలయ పర్వత శ్రేణుల్లో సముద్ర మట్టానికి సుమారు 14 వేల అడుగుల ఎత్తులో వెలసిన శ్రీ అమర్‌నాథ్ స్వామివారి హిమలింగ దర్శనం కోసం ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు జూలై,ఆగస్టు నెలల్లో ఈ పవిత్ర యాత్రను చేపడతారు.ఈ సందర్భంగా హిందూ వాహిని సభ్యులు మాట్లాడుతూ,శ్రీ అమర్‌నాథ్ యాత్ర అత్యంత పవిత్రమైనదే కాకుండా సాహసోపేతమైన యాత్ర అని అన్నారు.ప్రతి హిందువు జీవితంలో ఒక్కసారైనా ఈ దివ్యక్షేత్రాన్ని దర్శించాలని ఆకాంక్షిస్తారని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన భక్తులు కూడా ఈ పవిత్ర యాత్రలో పాల్గొనేలా తెలంగాణ ప్రభుత్వం ఉచిత అమర్‌నాథ్ యాత్ర పథకాన్ని ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. స్వామివారి హిమలింగ దర్శనం చేసుకునే అవకాశం లభించడం తమ పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని తెలిపారు.ఈ యాత్రలో చెట్ల వెంకటేష్,ప్రవీణ్ సింగ్,అందే జంగారాజ్, శివశంకర్,సళ్ళ మహేష్,అశోక్, శ్రీను,లింగారం సాయి,పసులోటి శ్రావణ్,కుమార్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణలో ప్రతి అర్హుడూ భాగస్వామి కావాలి

**షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్**

**228,230 బూతులలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**షాద్‌నగర్ పట్టణంలోని 228, 230 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు) బూత్ స్థాయి ప్రతినిధులతో కలిసి ఇంటింటికి వెళ్లి గణన పత్రాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, సీనియర్ నాయకులు రఘునాయక్, ముబారక్ అలీ ఖాన్,యువ నాయకుడు భాష తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని అన్నారు.ప్రతి అర్హత కలిగిన ఓటరు తన వివరాలను సరిచూసుకుని గణన పత్రాలను సక్రమంగా నింపి సంబంధిత బూత్ లెవెల్ అధికారులకు అందజేయాలని కోరారు.ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు,రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి ప్రతినిధులు పరస్పర సహకారంతో ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి ఇంటికి చేరుకుని అవగాహన కల్పిస్తున్న బూత్ లెవెల్ అధికారుల సేవలను ఆయన అభినందించారు.

# పాపిరెడ్డిగూడ చారిత్రక సంపదను పరిరక్షించాలి

**షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు..**

**పురాతన కట్టడాలు, బావులను వారసత్వ సంపదగా ప్రకటించాలని డిమాండ్..**

**సవై వెంకట్‌రెడ్డి పాలన, సుబ్బారాయుడు చరిత్ర పై ఆసక్తికర వివరాలు..**

**అన్యాక్రాంతమైన భూములపై సమగ్ర విచారణ జరపాలని విజ్ఞప్తి..**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
చారిత్రక కట్టడాలు, పురాతన బావులు,చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రజల వారసత్వ సంపాదన భవిష్యత్తు తరాలకు అందజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు స్పష్టం చేశారు.
గురువారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని కేశంపేట మండలం పాపిరెడ్డిగూడ గ్రామాన్ని తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే, పోలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు సందర్శించారు.ఈ సందర్భంగా గ్రామంలోని చారిత్రక కట్టడాలు, పురాతన బావులు,చారిత్రక నేపథ్యంపై మీడియాతో మాట్లాడారు.
పాపిరెడ్డిగూడ గ్రామం ఒకప్పుడు “అవాజ్ మియా పడకల్“ పేరుతో ప్రసిద్ధి చెందిన ప్రాంతమని, చరిత్రలో దీనికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. 1692 ప్రాంతంలో ప్రజా కంటకుడిగా పేరొందిన గజదొంగ సుబ్బారాయుడు ఫరూక్‌నగర్ సమీపంలోని వల్లభాపురంలో దోచుకున్న ధనాన్ని ఈ ప్రాంతంలో దాచేవాడని చరిత్ర చెబుతోందని వివరించారు.
సుబ్బారాయుడు దోపిడీలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడంతో అప్పటి పాలకుడు సవై వెంకట్‌రెడ్డి వద్ద ప్రజలు మొరపెట్టుకున్నారని తెలిపారు. అనంతరం సవై వెంకట్‌రెడ్డి సుబ్బారాయుడిని పట్టుకుని హతమార్చి ప్రజలను అతని పీడ నుంచి విముక్తి కల్పించారని పేర్కొన్నారు. ప్రస్తుత ఫరూక్‌నగర్ ప్రాంతానికి సవై వెంకట్‌రెడ్డి తల్లి పేరు మీద పెద్ద జానంపేట గ్రామం ఏర్పాటైందని, అలాగే సవై వెంకట్‌రెడ్డి భార్య కేశమ్మ పేరుతోనే నేటి కేశంపేట ఏర్పడిందని తెలిపారు.
పాపిరెడ్డిగూడలో ఉన్న పురాతన కట్టడాలు,చారిత్రక ఆనవాళ్లను పరిరక్షించాలని గతంలో తాను పురావస్తు శాఖకు వినతిపత్రాలు సమర్పించానని గుర్తు చేశారు.శాఖ అధికారులు ఒకసారి వచ్చి పరిశీలించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి పరిరక్షణ చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు.
గ్రామంలోని సర్వే నంబర్ 227/1లో ఉన్న 4.32 ఎకరాల భూమి అన్యాక్రాంతానికి గురైందని ఆరోపించారు.ఆ భూమిలో కొంత భాగాన్ని రైతుకు ఎలా కేటాయించారనే అంశంపై అప్పట్లోనే ఫిర్యాదులు చేశామని తెలిపారు.అలాగే మాధవరెడ్డి తండ్రి నరసింహారెడ్డి పేరిట ఉన్న భూమికి సంబంధించిన పూర్తి వివరాలు, మిగిలిన భూమి ఏమైందనే అంశంపై అధికారులు ఇప్పటికీ సరైన రికార్డులు ఇవ్వడం లేదని విమర్శించారు. ప్రస్తుత ఫరూక్‌నగర్‌లో సీఎస్‌కే ఇలాఖా పరిధిలో మొత్తం నాలుగు



పురాతన మంచినీటి బావులు ఉన్నాయని తెలిపారు.వీటిని పురావస్తు శాఖ హెరిటేజ్ కింద గుర్తించి సంరక్షించాలని, మూసివేసిన బావులను వెలికితీసి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఫరూక్‌నగర్‌లోని అన్ని పురాతన బావులు రాజుల కాలానికి చెందినవని,వాటికి చారిత్రక ప్రాధాన్యం ఉందన్నారు. ఇటీవలి వివాదాస్పద బావి అంశంపై స్పందిస్తూ,అది కూడా పురాతన కాలంలో నిర్మించబడిన చారిత్రక బావేనని, ఒకప్పుడు “పీర్ల బావి“గా ప్రసిద్ధి చెందిందని చెప్పారు.చారిత్రక వారసత్వానికి నిలువెత్తు నిదర్శనాలైన ఈ బావులు, కట్టడాలను ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకుని సంరక్షించి, భవిష్యత్తు తరాలకు అందించేలా చర్యలు తీసుకోవాలని బక్కని నర్సింహులు ప్రభుత్వాన్ని కోరారు.

# పెళ్లి పేరుతో యువతిని మోసం చేసిన యువకుడు అరెస్ట్..

**నాగోల్,(ప్రజావినికిడి):**
నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పెళ్లి పేరుతో యువతిని మోసం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు.నాగోల్ పరిధిలోని ఆనంద్‌నగర్‌కు చెందిన ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, శామీర్‌పేట్‌కు చెందిన ముకేరా గోవర్ధన్ (29) అనే వ్యక్తి సోషల్ మీడియా ద్వారా పరిచయం పెంచుకున్నట్లు పోలీసులు తెలిపారు.తాను ఆర్మీ అధికారినని నమ్మించేందుకు నకిలీ ఏఐ (ఆ×) ఫోటోలను ఉపయోగించిన నిందితుడు, బాధితురాలితో సన్నిహిత సంబంధం ఏర్పరుచుకుని ప్రేమిస్తున్నట్లు నమ్మించి,పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ఆమెతో సహజీవనం చేస్తూ శారీరకంగా దుర్వినియోగం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.





అదేవిధంగా,తన తండ్రి ఆరోగ్యం బాగోలేదని చెప్పి బాధితురాలి నుంచి భారీ మొత్తంలో డబ్బు తీసుకుని మోసానికి పాల్పడటంతో పాటు,ఆమెను బెదిరించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. పోలీసుల దర్యాప్తులో నిందితుడికి ఇప్పటికే వివాహం జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. ఇంకా,గత ఏడాది ఆల్వాల్‌కు చెందిన మరో మహిళను కూడా ఇదే తరహాలో పెళ్లి పేరుతో మోసం చేసిన కేసులో అతను అరెస్టై జైలుకు వెళ్లి, ప్రస్తుతం బెయిల్‌పై బయటకు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు.
ఈ కేసులో నిందితుడిని నాగోల్ పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి అతనికి రిమాండ్ విధించి చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించినట్లు నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు.సోషల్ మీడియా ద్వారా ఏర్పడే పరిచయాల విషయంలో ప్రజలు, ముఖ్యంగా యువతులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టం చేయాలి.

**సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం - ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కేవై ప్రణయ్**






**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
జూలై 02: తెలంగాణ రాష్ట్రంలో కార్పొరేట్,ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రించేందుకు ప్రత్యేక ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని, విద్యాసంస్థలను పుస్తకాలు, యూనిఫాంలు, నోట్‌బుక్స్ విక్రయ కేంద్రాలుగా మార్చే విధానాన్ని నిలిపివేయాలని, అలాగే ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తామన్న ముఖ్యమంత్రి ప్రకటనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కేవై ప్రణయ్ మాట్లాడుతూ, విద్యారంగాన్ని అత్యంత ప్రాధాన్య రంగంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి స్వయంగా విద్యాశాఖ బాధ్యతలు నిర్వహిస్తూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తామని ప్రకటించడం అత్యంత బాధ్యతారాహిత్యమని అన్నారు. ఒకవైపు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు ప్రోత్సాహం ఇస్తూ, మరోవైపు ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలని నిర్ణయించడం ప్రభుత్వ విద్యకు గోరి కట్టడమేనని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు ఇప్పటికీ అందించలేదని, బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేయలేదని, మధ్యాహ్న భోజన పథకం కూడా సక్రమంగా అమలు కావడం లేదని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయకుండా ఇప్పుడు పాఠశాలలను మూసివేయాలని చూడటం దుర్మార్గమైన చర్య అని అన్నారు. తమిళనాడు ప్రభుత్వం ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రిస్తూ వాటిని బహిరంగంగా ప్రదర్శించే విధానాన్ని అమలు చేస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఫీజుల దోపిడీపై ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవని, మరుగుదొడ్లు, వాష్‌రూమ్‌లు, తాగునీటి సౌకర్యం,రన్నింగ్ వాటర్ వంటి ప్రాథమిక వసతులు కల్పించలేదని తెలిపారు.వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా,మండల విద్యాశాఖ అధికారుల పోస్టులను కూడా శాశ్వతంగా భర్తీ చేయకుండా ఎఫ్ఏసీలతోనే కొనసాగిస్తున్నారని విమర్శించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య హక్కులపై దాడిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఖండించింది.
అక్రమంగా అరెస్టు చేసిన విద్యార్థి నాయకులను వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారని,ఈ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించకపోతే రేపటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అరెస్టయిన వారిలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామెర కిరణ్,కె. అశోక్ రెడ్డి,రాష్ట్ర కమిటీ సభ్యులు కార్తీక్,లెనిన్ గువేరా,రమేష్, వెన్నెల,రాష్ట్ర నాయకులు శ్రీకాంత్,లిఖిత్, చరణ్,తరంగ్, అరుణ్,నాగేందర్, స్టాలిన్,వినోద్, శ్రీరామ్,ప్రవీణ్, శ్రీకాంత్,చరణ్, తనిష్క్, అభినవ్,తదితరులు ఉన్నారు.

# అభిషేకాలు అంటిరి..ఆగం జేస్తిరి



## సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ జీవోను వ్యతిరేకిస్తాం

## డంపింగ్ యార్డ్ వ్యతిరేక కమిటీ చైర్మన్

## ఎమ్మె సత్యనారాయణ హెచ్చరిక

## మా గ్రామాలు నాశనం చేస్తామంటే ఊరుకోం..

## జీవో వెనక్కి తీసుకోకపోతే ప్రళయం సృష్టిస్తాం..

## ప్రభుత్వానికి మా ఆందోళనలు కనిపించలేదా..?

## ఐటీ పార్కు కోసం కేటాయించి ఇప్పుడు చెత్త వేస్తామంటారా..?

## రాజకీయాలకు అతీతంగా ఉద్యమించాలని పిలుపు

## ఏగిసిన ఉద్యమాలపై నీళ్లు చల్లి చల్లారిస్తిరి..

## ఇప్పుడేం సమాధానం చెబుతారు..?



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ ను రద్దు చేస్తున్నామని చెప్పిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హామీతో ఉదృతమైన ఆందోళనలను విరమించి ఊపిరి తీసుకుంటున్న వేళ

ప్రభుత్వం దీనిపై జీవోను అధికారికంగా విడుదల చేసి తమ ప్రాణాలకు ముప్పు తెచ్చి పెట్టిందని,ప్రజల ప్రాణాలకు ముప్పు తెచ్చే ఈ జీవోను ఎంత మాత్రం ప్రజలు సహించబోరని దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని డంపింగ్ యార్డ్ వ్యతిరేక కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ హెచ్చరిక జారీ చేశారు. గురువారం మీడియాలో వచ్చిన కథనాలపై సత్యనారాయణ స్పందించారు. జీవో జారీ వ్యవహారంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఇటీవలే ఊర్లన్నీ ఏకమై రాజకీయాల్లో కతీతంగా ఆందోళన చేపట్టి పాదయాత్ర ద్వారా జిల్లా కలెక్టర్ ను కలిసి తమగోడు విన్నవించామని, దీనిపై స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సైతం స్థానిక ప్రజలకు భరోసా ఇచ్చి డంపింగ్ యార్డ్ ఎట్టి పరిస్థితుల్లో రాదని చెప్పడంతో ఆందోళనలు విరమించామని, తీరా డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు ప్రభుత్వ జీవో విడుదల కావడం సబబు కాదని సత్యనారాయణ పేర్కొన్నారు. ఓవైపు జవహర్ నగర్ ప్రజలు ఎలా నాశనం అవుతున్నారు ఇప్పుడు అదే మాదిరిగా సిద్దాపూర్ తోపాటు 20 నుండి 30 గ్రామాల వరకు దీని బారిన పడి నాశనం అయ్యే పరిస్థితి దాపురించిందని సత్యనారాయణ పేర్కొన్నారు.

### ముందు నుంచే మాకు అనుమానం

సిద్ధాపూర్‌లో 4 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన డంపింగ్ యార్డును 86 ఎకరాల్లో రూ.86 కోట్లతో ఏర్పాటు చేసేందుకు ఓ సంస్థ అన్ని అనుమతులు తీసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తాము గతంలో అనుమానాలు వ్యక్తం చేశామని తెలిపారు. హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఎంఎస్‌డబ్ల్యూ లిమిటెడ్ కంపెనీ పేరిట అనుమతులకు ఓ సంస్థ తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలికి దరఖాస్తు చేసుకున్నదనీ,ఈ ప్రాజెక్టును మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఫెసిలిటీ విత్‌ఔట్ ల్యాండ్ ఫిల్ పేరిట చేపట్టనున్నట్లు పేర్కొన్నదనీ సత్యనారాయణ గుర్తు చేశారు. ప్రాజెక్టులో భాగంగా 200 టీపీడీ (టన్ పర్ డే)సామర్థ్యం కలిగిన మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ, 200 టీడీపీ సామర్థ్యంతో ఫుడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్,18 టీపీడీ సామర్థ్యం కలిగిన బయోగ్యాస్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయనున్నారనీ, చెత్త నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు 24 మెగావాట్‌ల సామర్థ్యం కలిగిన ప్లాంట్‌ను నిర్మించనున్నట్లు ప్రాజెక్టు విధి విధానాల్లో పేర్కొన్నారనీ ఆయన పేర్కొన్నారు. చెత్తను రీసైక్లింగ్, రీయూస్ విధానంలో నిర్వహించనున్నట్లు తెలుస్తున్నదనీ, సేకరించిన 4 వేల మెట్రిక్ టన్నుల చెత్త మొత్తాన్ని ప్రాసెసింగ్ చేసేందుకు డంపింగ్ యార్డ్ ఏర్పాటు కాబోతుందని తెలిపారు. సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డును ఏర్పాటు చేస్తారని తెలిసినప్పటి నుంచి పరిసర ప్రాంతాల్లోని తండాలు,ఇతర గ్రామాల ప్రజలు ఆందోళనలు చేపడుతున్నారనీ కొద్దిరోజులుగా ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతున్నామని ఇక్కడ ఇతర ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తను పడేయొద్దని ప్రభుత్వానికి డిమాండ్ చేశామని తెలిపారు. డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం వల్ల కాలుష్యం బారిన పడతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీలకు అతీతంగా రాజకీయ నేతలు సైతం ప్రజలతో పాటు ఆందోళనల్లో పాల్గొన్నారనీ, డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల గాలి,నేల, భూగర్భ జలాలు కలుషితమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని డంపింగ్ యార్డును ఏర్పాటు చేయొద్దని డిమాండ్ చేశామని తెలిపారు.

### ఐటీ భూములనీ కేటాయిస్తే..చెత్త వేస్తారా?

గ్రామీణ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అప్పటి కేసీఆర్ ప్రభుత్వం సిద్ధాపూర్ భూములను ఐటీ పార్కు కోసం కేటాయించిందనీ సత్యనారాయణ తెలిపారు.ఈ ప్రాంతంలో రైతులు పంటలను ఎక్కువగా పండిస్తారనీ ఇందులో కొంత భూమిని కొన్ని ప్రాసెసింగ్ యూనిట్‌ల కోసం కూడా కేటాయించారన్నారు.విలువైన భూములను ప్రజల ప్రయోజనం కోసం వినియోగించాలే తప్ప..ఈ ప్రాంతాన్ని కలుషితం చేసే చెత్త డంపింగ్ యార్డుకు ఎలా కేటాయిస్తారనీ సత్యనారాయణ తెలిపారు.పైగా ఈ ప్రాంతం నుంచి వర్షపునీరు పాటు కాలువల ద్వారా హిమాయత్‌సాగర్‌లో కలుస్తాయనీ, అలాంటప్పుడు చత్త డంపింగ్‌యార్డును ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తే ఈ నీరు అంతా సాగర్‌లో కలిసి నగరానికి నీరందించే నీరు కలుషితం కాదా? టన్నులకొద్దీ చత్తను తీసుకొచ్చి ఇక్కడ నిల్వ చేస్తే ఇక్కడి ప్రజలు ఎలా జీవనం సాగిస్తారన్నారు. ఈ భూమిని ఈ ప్రాంతంలో చెత్త డంపింగ్‌యార్డును నిర్మిస్తే ఒప్పుకునే పరిస్థితి లేదనీ హెచ్చరించారు. అధికార పార్టీ నాయకులు ఆందోళనలపై నీళ్లు చల్లి ఉద్యమాన్ని చల్లచారని హామీ ఇచ్చిన ఎమ్మెల్యేకు పాలాభిషేకం చేశారని ఇప్పుడు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని సత్యనారాయణ పత్రిక ముఖంగా ప్రశ్నించారు.



## చీకుపల్లి గ్రామ పంచాయతీలో డ్రై డే



**వాజేడు, జులై 2,(ప్రజావినికిడి):** చీకుపల్లి గ్రామ పంచాయతీ పరిదిలో సర్పంచ్ గొంది సత్యనారాయణ అధ్యక్షతన హెల్త్ క్యాంపు,డ్రై డే నిర్వహించారు హెల్త్ క్యాంపులో గ్రామస్తులకు హెల్త్ పరిక్షలు నిర్వహించి మందులు పంపిణి చేసారు గ్రామంలో ఇంటికి తిరిగి నిల్వ నీటిని తొలగించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం శ్రీదేవి, లలిత,ఆశా వర్కర్లు అంగన్వాడీ టీచర్, గ్రామస్తులు పాల్గొన్నారు

## నీటి గుంటలు పూడ్పించిన సర్పంచ్



**వాజేడు,జులై 2,(ప్రజావినికిడి):** గుమ్మడిదొడ్డి ఎంపియుపిఎస్ స్కూల్ ముందు వర్షపు నీటితో నీళ్లు నిల్వడంతో విషయం తెల్చుకున్న సర్పంచ్ బొదెబోయిన భరత్ కుమార్ వెంటనే జెసిబి తో మట్టి పోసి నీటి గుంటను పూడ్చడం జరిగింది స్కూల్ ఉపాధ్యాయులు పిల్లల తల్లిదండ్రులు సర్పంచ్ చేసి పనికి హర్షం వ్యక్తం చేసారు

## రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ స్పోక్స్ పర్సన్ గా యం.ఐ.ఇస్తియాక్ గుల్షానీ



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ స్పోక్స్ పర్సన్ గా సరూర్ నగర్ కు చెందిన యం.ఐ.ఇస్తియాక్ గుల్షానీ నియమితులయ్యారు.గురువారం టిపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా యం.ఐ.ఇస్తియాక్ గుల్షానీ మాట్లాడుతూ, పార్టీలో తాను చేసిన సేవలను గుర్తించి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ స్పోక్స్ పర్సన్ గా నియమించిన మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తన పై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధి కోసం పాటుపడుతానని తెలిపారు.నాకు ఈ పదవి రావడానికి సహకరించిన టీయుఎఫ్ ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కెఎల్ఆర్,టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్ రెడ్డి లతో పాటు సీనియర్ నాయకులు బోయిని మహేందర్ యాదవ్,బోయిని శంకర్ యాదవ్ తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు.

## షాద్ నగర్ పోలీస్ స్టేషన్ లో భరోసా (సిడిఈడబ్ల్యూ) ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ను ప్రారంభించిన డిసిపి శిరీష రాఘవేందర్..





**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ లో భరోసా (సిడిఈడబ్ల్యూ)ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ ప్రారంభం డీసీపీ శిరీషరాఘవేందర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవంషాద్‌నగర్, జూలై 1తెలంగాణ పోలీసుల మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో గృహహింస,లైంగిక వేధింపులు అదేవిదంగా కుటుంబ సమస్యలకు గురైన మహిళలు,బాధితులకు అండగా నిలిచేందుకు ఏర్పాటు చేసిన సహాయ కేంద్రమే భరోసా సిడిఈడబ్ల్యూ ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌మహిళలు ఇతర బాధితులకు త్వరితగతిన సేవలు అందించాలనే లక్ష్యంతో షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని బుధవారం షాద్‌నగర్ డీసీపీ శిరీషరాఘవేందర్, ప్రారంభించారు.బాధితులకు అన్ని సేవలు ఒకేచోట ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ,భరోసా సిడిఈడబ్ల్యూ ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ ద్వారా మహిళలు మరియు ఇతర బాధితులకు చట్టపరమైన సలహాలు,మానసిక పరామర్శ, కుటుంబ కౌన్సెలింగ్‌తో పాటు అవసరమైన సహాయ సేవలను ఒకే చోట అందజేస్తామని తెలిపారు.షాద్‌నగర్ జోన్ పరిధిలోని ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న బాధితులు ఎలాంటి భయాందోళనలు లేకుండా ముందుకు వచ్చి ఈ సేవలను వినియోగించుకోవాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ,సీఐ సీతారాం, పోలీసు అధికారులు,సిబ్బంది,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.అలాగే (సిడిఈ డబ్ల్యూ) ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ కౌన్సిలర్ ప్రసన్న లక్ష్మి,రిసెప్షనిస్ట్ అనిత ఇతర సిబ్బంది కూడా పాల్గొన్నారు.

## యాదాద్రి ట్రస్టు బోర్డు సభ్యురాలుగా నియమితులైన శుభ సందర్భంగా పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ కు శాలువతో సన్మానం చేసిన తోట మహేష్ యాదవ్



**మున్సురాబాద్, జూలై,2 (ప్రజా వినికిడి):** యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మి నరసింహా స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా నియమితురాలైన పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ ని వారి నివాసం లో మర్యాదపూర్వకంగా కలిసి శు భాకాంక్షలు తెలియజేసిన చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు తోట మహేష్ యాదవ్, అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈశ్వరమ్మ యాదవ్, ప్రజాసేవలో విశేషంగా పనిచేశారని ప్రస్తుతం యాదాద్రి వంటి ప్రతిష్టాత్మక దేవస్థానం ట్రస్టు బోర్డులో సభ్యురాలుగా నియామకం కావడం గర్వకారణం అని పేర్కొన్నారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కొత్తపేట యాదవ్ సంఘం అధ్యక్షుడు తోట శ్రీనివాస్ యాదవ్,తోట సురేష్ యాదవ్,తోట గోపాల్ యాదవ్ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## తొలి ఉమ్రా యాత్రను నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది

### మేనేజింగ్ డైరెక్టర్ ఆఫీస్ మహమ్మద్ ఫయాజ్ అలీ






**శంషాబాద్, (ప్రజావినికిడి):** ,తొలి ఉమ్రా యాత్రను నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని అల్ మిజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజర్ మహమ్మద్ ఫయాజ్ అలీ అన్నారు. ఇస్లామిక్ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గత 15 రోజుల క్రితం అల్ మిజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో ఉమ్రా యాత్రకు బయలుదేరిన 53 మంది భక్తులు పవిత్ర యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని తిరిగి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. యాత్ర విజయవంతంగా ముగియడంతో యాత్రికులకు అల్ మిజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆఫీస్ మహమ్మద్ ఫయాజ్ అలీ ఘన స్వాగతం పలికారు పూలమాలలతో కుటుంబ సభ్యులు, బంధువులు యాత్రికులను ఆత్మీయంగా ఆహ్వానించారు. యాత్ర విజయవంతంగా ముగియడంతో యాత్రికులు ఆనందం వ్యక్తం చేశారు.అల్ మిజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజర్ మహమ్మద్ ఫయాజ్ అలీ మాట్లాడుతూ, ఇస్లామిక్ నూతన సంవత్సరంలో గత 15 రోజుల క్రితం తొలి ఉమ్రా యాత్రను నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.హజ్ యాత్ర పూర్తి చేసుకున్న అనంతరం జిద్దా విమానాశ్రయంలో ఉమ్రా యాత్రికులను స్వాగతించి, వారితో కలిసి ఉమ్రా నిర్వహించారని తెలిపారు.

# యూజర్‌నేమ్ ఫీచర్ ఇంకా అందుబాటులోకి తీసుకురాలేదు

**దశలవారీగా తీసుకొచ్చే ప్రయత్నంలో ఉన్నాం**
**యూజర్ నేమ్ ఉన్నా ఫోన్ నంబర్ తప్పనిసరి**
**కేంద్రం అభ్యంతరాలకు వాట్సాప్ సమాధానం**




**న్యూఢిల్లీ,జులై 2,(ప్రజావినికిడి):** వాట్సాప్‌లో ప్రవేశపెట్టబోతున్న యూజర్‌నేమ్ ఫీచర్‌పై కేంద్ర ప్రభుత్వం వ్యక్తం చేసిన ఆందోళనల నేపథ్యంలో మెటా సంస్థకు చెందిన వాట్సాప్ కీలక వివరణ ఇచ్చింది. ప్రస్తుతం యూజర్‌నేమ్ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకురాలేదని, వినియోగదారులు తమకు నచ్చిన యూజర్ నేమ్‌ను ముందస్తుగా రిజర్వ్ చేసుకునే అవకాశం మాత్రమే కల్పించామని స్పష్టం చేసింది. ఈ ఫీచర్‌ను ఈ ఏడాది చివర్లో దశలవారీగా అమలు చేస్తామని వెల్లడించింది. యూజర్‌నేమ్ ఫీచర్‌తో వినియోగదారులు తమ మొబైల్ నంబర్‌ను వెల్లడించకుండా కొత్త వ్యక్తులు, గ్రూపులతో కనెక్ట్ అయ్యే అవకాశం ఉంటుందని తెలిపింది. ఈ ఫీచర్‌తో గోప్యత, భద్రత, నకిలీ ఖాతాలు, మోసాలు వంటి అంశాలపై వస్తున్న సందేహాలకు ఎక్స్ వేదికగా వివరణ ఇచ్చింది. యూజర్‌నేమ్‌ను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సృష్టించాల్సిన అవసరం లేదని వాట్సాప్ తెలిపింది. ఇది పూర్తిగా వారి ఇష్టమని పేర్కొంది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో ఇప్పటికే ఉన్న యూజర్‌నేమ్‌లు ఆయా ఖాతాదారుల కోసం రిజర్వ్ చేయబడతాయని వాట్సాప్ తెలిపింది. అలాగే ప్రముఖులు, ప్రభుత్వ సంస్థలు, సెలబ్రిటీలు, మెటా వెరిఫైడ్ ఖాతాలకు సంబంధించిన పేర్లు, వాటి వేరియేషన్లు కూడా దుర్వినియోగానికి గురి కాకుండా రక్షిస్తామని పేర్కొంది. ఒకవేళ సాధారణ పేరు ఇప్పటికే మరొకరు తీసుకున్నట్లయితే, ప్రత్యామ్నాయ యూజర్‌నేమ్‌లను సూచించే జనరేటర్‌ను ఉపయోగించుకోవచ్చని తెలిపింది. తన యూజర్‌నేమ్‌కు దగ్గరగా మరో వ్యక్తి పేరు సృష్టించి మోసాలకు పాల్పడితే ఎలా అనే ప్రశ్నకు వాట్సాప్ స్పందించింది. యూజర్‌నేమ్‌లను సెర్చ్ చేసే అవకాశం ఉండదని స్పష్టం చేసింది. యూజర్‌నేమ్ ఆధారంగా సందేశాలు పంపే ఫీచర్ అందుబాటులోకి వచ్చిన తర్వాత, కొత్త వ్యక్తి నుంచి మెసేజ్ వస్తే అతని దేశం, ఖాతా వివరాలు, భద్రతా హెచ్చరికలు చూపిస్తామని తెలిపింది. ఇప్పటికే ఉన్న బ్లాక్, రిపోర్ట్ వంటి భద్రతా చర్యలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొంది.

యూజర్‌నేమ్‌తో పాటు 'యూజర్‌నేమ్ కీ' అనే అదనపు భద్రతా వ్యవస్థను కూడా ప్రవేశపెడుతున్నట్లు వాట్సాప్ వెల్లడించింది. దీన్ని యాక్టివేట్ చేసుకుంటే, అవతలి వ్యక్తికి యూజర్‌నేమ్‌తో పాటు కీ కూడా తెలిసి ఉండాల్సి ఉంటుంది. అవసరమైతే ఈ కీని ఎప్పుడైనా మార్చుకునే అవకాశం ఉంటుందని తెలిపింది.

ఫేస్‌బుక్ లేదా ఇన్‌స్టాగ్రామ్‌లో ఉన్న అదే యూజర్‌నేమ్‌ను వాట్సాప్‌లో కూడా ఉపయోగించాలనుకునే వారు ముందుగా ఆ ఖాతాలను లింక్ చేసి యాజమాన్యాన్ని నిర్ధారించుకోవాల్సి ఉంటుందని తెలిపింది. అనంతరం కావాలంటే ఆ ఖాతాలను అన్‌లింక్ చేసుకునే అవకాశం కూడా ఉంటుందని వెల్లడించింది.

యూజర్‌నేమ్ ఫీచర్ అమలుతో నకిలీ గుర్తింపులు, డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఆర్థిక మోసాలు పెరిగే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ అధికారులు, ఆర్థిక సంస్థలు, ప్రజాప్రతినిధుల పేర్లతో పోలిన యూజర్‌నేమ్‌లను దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని పేర్కొంటూ ప్రభుత్వంతో సంప్రదింపులు పూర్తయ్యే వరకు ఈ ఫీచర్‌ను అమలు చేయొద్దని వాట్సాప్‌ను ఆదేశించింది. అలాగే ఫీచర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, భద్రతా చర్యలపై మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని నోటీసు జారీ చేసింది. దీనిపై స్పందించిన వాట్సాప్ ప్రతినిధి ప్రస్తుతం యూజర్‌నేమ్‌లను రిజర్వ్ చేసుకునే అవకాశం మాత్రమే కల్పించామని, యూజర్‌నేమ్ ఆధారంగా మెసేజింగ్ సేవ ఇంకా ప్రారంభం కాలేదని స్పష్టం చేశారు. ప్రముఖులు, ప్రభుత్వ సంస్థలు, సెలబ్రిటీలు, మెటా వెర్గి÷డ్ ఖాతాలకు సంబంధించిన యూజర్‌నేమ్‌లను వారి అసలు యజమానుల కోసమే రిజర్వ్ చేసినట్లు తెలిపారు. అలాగే యూజర్‌నేమ్‌ను కచ్చితంగా తెలుసుకోవాల్సిన విధానం, యూజర్‌నేమ్ కీ, అనుమానాస్పద కార్యకలాపాల గుర్తింపు, మోసాల నివారణ వంటి పలు భద్రతా చర్యలను అమలు చేస్తున్నట్లు వివరించారు. వాట్సాప్‌ను ఉపయోగించడానికి మొబైల్ నంబర్ తప్పనిసరిగా కొనసాగుతుందని కూడా స్పష్టం చేశారు.

# అగ్రరాజ్యంలో చీకటి కోణం

**రహస్యంగా 16మంది చిన్నారుల నిర్బంధం -ఓ కేసు కోసం వెళ్లిన పోలీసులకు కనపడ్డ దృశ్యం**



**న్యూయార్క్,జులై 2,(ప్రజావినికిడి):**అగ్రరాజ్యం అమెరికాలోని ఒహాయో రాష్ట్రంలో వెలుగులోకి వచ్చిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. 16 మంది చిన్నారులను ఏళ్ల తరబడి ఓ పాడుబడిన ఇంట్లో బంధించి ఉంచిన విషయం తాజాగా బయటపడింది. మరో కేసు దర్యాప్తు నిమిత్తం పోలీసులు ఆ ఇంటికి వెళ్లగా అక్కడ కనిపించిన దృశ్యాలు వారిని దిగ్భాం÷-రతికి గురి చేశాయి. అత్యంత దయనీయ పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను వెంటనే రక్షించిన పోలీసులు, వారిని బంధించిన నలుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఒహాయో రాష్ట్రంలోని హామ్డెన్‌లో రైల్వే ట్రాక్ పక్కన దట్టమైన చెట్లు, పొదల మధ్య ఉన్న ఓ ఇంటికి పోలీసులు సెర్చ్ వారెంట్‌తో వెళ్లారు. అక్కడ 16 మంది చిన్నారులను వారి తల్లిదండ్రులు, తాతా అమ్మమ్మలు బంధించి ఉంచినట్లు గుర్తించారు. గత నాలుగేళ్లుగా వారు అమానవీయ పరిస్థితుల్లో జీవిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. బాధిత చిన్నారులను 12 అడుగుల పొడవు, 12 అడుగుల వెడల్పు గల ఒకే గదిలో ఉంచినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. చిన్నారుల వయస్సు 18 నెలల నుంచి 18 సంవత్సరాల మధ్య ఉండగా, వారిలో బాలురు, బాలికలు ఉన్నారు. అంతేకాక, ఆ ఇంట్లో ఇంతమంది చిన్నారులు ఉన్న విషయం చుట్టుపక్కల వారికి కూడా తెలియకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. చిన్నారులకు బయటి ప్రపంచంతో దాదాపు ఎలాంటి సంబంధం లేకుండా ఉంచినట్లు అధికారులు గుర్తించారు. వారిలో ఎవరినీ ఇప్పటివరకు తల్లిదండ్రులు పాఠశాలకు పంపలేదు. చాలా కాలం పాటు బంధించబడటంతో వారు సాధారణంగా మాట్లాడటానికే ఇబ్బంది పడుతున్నట్లు ఒహాయో అటార్నీ జనరల్ తెలిపారు. దాదాపు అందరూ అడవి మనుషుల్లా కనిపించారని ఆయన పేర్కొన్నారు. ఈ 16 మంది చిన్నారులూ ఒకే కుటుంబానికి చెందినవారని అధికారులు వెల్లడించారు. రక్షించిన వెంటనే ఏడుగురు చిన్నారులను చికిత్స కోసం కొలంబస్‌లోని ఆస్పత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో హెలికాప్టర్‌లో అత్యవసర చికిత్స కోసం తరలించాల్సి వచ్చింది. ఘటనలో పిల్లల తల్లిదండ్రులు, తాతా అమ్మమ్మలైన గ్యారీ సైడర్స్ జూనియర్, గ్యారీ సైడర్స్ సీనియర్, క్రిస్టినా సైడర్స్, ఎలిజబెత్ సైడర్స్‌లపై సెకండ్-డిగ్రీ ఫెలనీ 'చైల్డ్ ఎండేంజర్‌మెంట్' అభియోగాలు నమోదు చేశారు. అనంతరం వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మరోవైపు ప్రతి నిందితుడికి 3 లక్షల డాలర్ల పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేయాలని కోర్టు నిర్ణయించింది.

# తెలంగాణలో సవాళ్ల రాజకీయాలు !






**జులై 2 ,(ప్రజావినికిడి):** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సవాళ్లు ప్రతిసవాళ్లతో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అధికార పార్టీని ఎండగట్టడమే పనిగా బిఆర్ఎస్ పనిచేస్తోంది. విపక్ష బిఆర్ఎస్ లక్ష్యంగా ఈ మధ్య సిఎం రేవంత్ కూడా ఘాటుగానే దాడి చేస్తున్నారు. ఎపిలో కూడా దాదాపు ఇదే తరహా రాజకీయాలు నడుస్తున్నాయి. జగన్ పార్టీని గొడ్డలి పార్టీ అంటూ అధికార టిడిపి దుమ్మెత్తి పోస్తోంది. జగన్ కూడా ఎపిలో చట్టాలకు విలువ లేకుండా పోయిందని అంటున్నారు. మొత్తంగా అభివృద్ధి, ప్రజల అవసరాలు పక్కకు పోయాయి. సవాళ్లు, ప్రతిసవాళ్లు నడుస్తున్నాయి. తమ రాజకీయం కోసం రాష్ట్ర అభివృద్ధిని, పాలనను పక్కన పెట్టారు. ఇకపోతే తెలంగాణలో అంతకుమించి అన్నట్లుగా సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాజకీయాలు వేడెక్కాయి. ఇప్పుడే ఎన్నికలు లేవు. మరో రెండేళ్ల సమయం ఉంది. అయినా అప్పుడే ఎన్నికల వేడి పుట్టించేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీది రెండున్నరేండ్ల చెత్త పాలన అంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,హరీష్ రావులు విమర్శలు గుప్పిస్తున్నారు. బిఆర్ఎస్ అప్పులు చేసి, రాష్ట్రాన్ని ఆగం చేసిందని సిఎం రేవంత్ సహా మంత్రులు అడపాదడపా విమర్శలు గుప్పిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమాల పై లెక్కలతో పక్కాగా వివరిస్తామని ప్రతిగా బిఆర్ఎస్ నేతలు సవాళ్లు విసరుతున్నారు. అసెంబ్లీ లేకపోతే వేదిక ఏదైనా బీఆర్ఎస్ తరపున తాను చర్చకు వస్తా.. రాహుల్‌గాంధీ వస్తారో? ఇంకెవరొస్తారో తేల్చుకోండి. మీ పాలనావైఫల్యాలను లెక్కలతో బయటపెట్టకపోతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకొంటానని కెటిఆర్ చాలెంజ్ చేశారు. కాగా,కేటీఆర్ సవాల్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. తాను తెలంగాణ భవన్‌కు వస్తానని మంత్రి ప్రతి సవాల్ విసిరారు. మంత్రి చాలెంజ్‌ను స్వీకరించిన బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్‌లో మీ కోసం ప్రత్యేకంగా కుర్చీ రెడీగా ఉంది. మీదే ఆలస్యం దమ్ముంటే చర్చకు రావాలన్నారు. దీంతో ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. అటు తెలంగాణ భవన్, ఇటు గాంధీ భవన్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జూపల్లి వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్ రావు బీఆర్ఎస్ భవన్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. జూపల్లి వస్తే కేంద్ర ప్రభుత్వ నివేదికలు, ఆర్‌బీఐ లెక్కలు, సాక్ష్యాలతో సహా వివరిస్తామని వారు తెలిపారు. కాగా, జూపల్లితో చర్చకు కేటీఆర్ అవసరం లేదని తాను సరిపోతానని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కావాలంటే కేటీఆర్ కూడా వస్తారన్నారు. ఇలా రోజుకో సవాల్, ప్రతి సవాల్‌లో రాజకీయాలు నడుస్తున్నాయి. ఏ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. ఎన్ని నెరవేర్చారో చర్చకు బరాబర్ సిద్ధమేనన్నారు. కాంగ్రెస్ అప్పుల బాగోతాన్ని లెక్కలతో తిప్పికొడుతామన్నారు. సవాళ్లు, ప్రతి సవాళ్ల నేపథ్యంలో తెలంగాణలో రాజకీయాలు హాట్‌హాట్‌గా సాగుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి కూడా ప్రత్యర్థులకు చెక్ పెట్టేందుకు అడపాదడపా బిజెపి, బిఆర్ఎస్‌లను లక్ష్యంగా నేరుగా విమర్శలు చేస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ళ సమయం ఉన్నా, అప్పుడే ఎలక్షన్ మూడ్ వచ్చేస్తున్నట్టు కనిపిస్తోంది. అన్ని రాజకీయ పార్టీలు అదే తరహా ప్లానింగ్‌లో ఉన్నాయి. అందునా అధికారంలో ఉన్నాం కాబట్టి ఎక్కడా తగ్గకూడదన్న ఉద్దేశ్యం కాంగ్రెస్ పార్టీలో, ప్రత్యేకించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో కనిపిస్తోంది. రాష్ట్రంలో రెండోసారి అధికారం చేపట్టేందుకు అవసరమైన ఎత్తుగడలకు ఆయన పదును పెడుతున్నట్టు కనిపిస్తోంది. ఎందుకంటే మళ్లీ కాంగ్రెస్ సర్కార్ వస్తుందని, తానే సిఎంనని పదేపదే ప్రకటిస్తున్నారు. ఇదంతాఒక ఎత్తయితే విపక్ష బిఆర్ఎస్, బిజెపిలను దెబ్బకొట్టడంతో పాటు, బలంగా లేని చోట కాంగ్రెస్‌ను బలోపేతం చేసే పనిలో పడ్డారని తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీ ఎక్కడైతే బలంగా లేదో అక్కడి నుంచే కార్యాచరణ మొదలు పెట్టాలని రేవంత్ రెడ్డి పని చేస్తున్నారు. ఆ రెండు పార్టీలకు చెక్ పెట్టడానికి అక్కడి నుంచే యుద్ధం ప్రారంభించాలని సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో దీనికి సంబంధించిన చర్చలు గట్టిగానే నడుస్తున్నాయి. వచ్చే డిసెంబర్ నుంచి తన పొలిటికల్ స్కెచ్‌ని అమలు చేసే పనిలో ముఖ్యమంత్రి ఉన్నట్టు తెలుస్తోంది. అందుకు ఇప్పటినుంచి గ్రౌండ్ వర్క్ మొదలు పెట్టినట్టు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్‌ని రెండోసారి అధికారంలోకి తీసుకొస్తానని ఇప్పటికే చేసిన ప్రకటనకు అనుగుణంగా పొలిటికల్ గ్రౌండ్ ప్రిపేర్ చేసుకునే పనిలో ఉన్నారన్నది పొలిటికల్ టాక్. డిసెంబర్ తర్వాత పూర్తిగా గ్రౌండ్‌లోనే ఉండాలని రేవంత్ డిసైడ్ అయినట్టు కనపడు తోంది. అందుకోసం ప్రధానంగా ఉత్తర తెలంగాణ మీద ఫోకస్ పెట్టబోతున్నారట. దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి గట్టి పట్టుంది. గత ఎన్నికల్లో ఆ విషయం నిరూపితమైంది కూడా. కానీ, ఉత్తర తెలంగాణలో బీజేపీ బలపడుతున్నందున ఇక అక్కడ ఫోకస్ చేయాలన్నది సీఎం ప్లాన్‌గా తెలుస్తోంది. ఉత్తర తెలంగాణ నుండి తన రాజకీయ వ్యూహాన్ని అమలు చేసే పనిలో భాగంగా బస్సు యాత్ర లేదంటే పాదయాత్ర చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వ పథకాల అమలు, రాజకీయ ఎత్తుగడల్ని అక్కడి నుంచే అమలు చేయాలని భావిస్తున్నారని సమాచారం. వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్, బీజేపీల కట్టడిని అక్కడి నుంచే మొదలుపెట్టాలనుకుంటున్నట్లు అర్థం అవుతోంది. . ఓట్ బ్యాంకును పెంచుకోవడంతో పాటు,తన రెండున్నరేళ్ళ పాలన, గత బీఆర్ఎస్ పాలనపై చర్చకు పెట్టడంతో పాటు కేంద్రంలోని బీజేపీ తీరు, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి కూడా ప్రజలు మాట్లాడుకునేలా చేయాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. గత ఎన్నికలకు ముందు పాదయాత్ర నిర్వహించారు రేవంత్‌రెడ్డి. అది ఎలా ఉన్నా విపక్ష పార్టీలకు చెక్ పెట్టే లక్ష్యంతో ఏకంగా రెండు పార్టీలపై దాడిని ముమ్మరం చేశారు. దీంతో తెలంగాణలో రాజకీయం వేడెక్కింది. .

## హయత్ నగర్ లో ఘనంగా ‘రుద్రా ఫర్నిషింగ్స్‘ ప్రారంభోత్సవం



**హయత్ నగర్,జూన్ 2,(ప్రజావినికిడి):** హయత్ నగర్ లో ‘రుద్రా ఫర్నిషింగ్స్‘ ప్రారంభోత్సవ వేడుక గురువారం ఘనంగా జరిగింది. కర్టెన్లు,బ్లైండ్స్, వాల్ పేపర్స్ తదితర నాణ్యమైన ఇంటీరియర్ ఉత్పత్తులను స్థానిక ప్రజలకు అందుబాటులోకి తెస్తూ ఈ నూతన షోరూమ్ ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నార్కట్ పల్లి మాజీ ఎంపీపీ అలాగే నల్గొండ మాజీ గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, అలాగే బుసిరెడ్డి పాండురంగారెడ్డి విచ్చేసి షోరూమ్ ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, మారుతున్న ఆధునిక కాలానికి అనుగుణంగా, ప్రజల అభిరుచులకు తగ్గట్టుగా వినూత్న డిజైన్లతో ఫర్నిషింగ్స్ షోరూమ్ ను హయత్ నగర్ లో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నాణ్యమైన ఉత్పత్తులను వినియోగదారులకు అందిస్తూ, కస్టమర్ల మన్ననలు పొంది వ్యాపారంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులకు వారు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రుద్రా ఫర్నిషింగ్స్ నిర్వాహకుడు కున్ రెడ్డి సంతోష్ రెడ్డి మాట్లాడుతూ, అందమైన ఇళ్లకు మరింత శోభను చేకూర్చేలా అత్యుత్తమ కర్టెన్లు, బ్లైండ్స్,ఆధునిక వాల్ పేపర్లను సరసమైన ధరలకే తమ షోరూమ్ లో అందుబాటులో ఉంచామని తెలిపారు.ప్రతి ఇంటిని అందంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో, కస్టమర్ల సంతృప్తే ప్రధాన లక్ష్యంగా అత్యుత్తమ సేవలు అందిస్తామని, స్థానిక ప్రజలు తమ షోరూమ్ ను ఆదరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## గిరిజన, ఆదివాసీల సమస్యలపై పోరాటాలు తీవ్రతరం చేయాలి

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు**



**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** రాష్ట్రంలో గిరిజన, ఆదివాసీల సమస్యలపై పోరాటాలు తీవ్రతరం చేయాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు కోరారు. హైదరాబాద్, హిమాయత్ నగర్, అమృత ఎస్టేట్స్ , సమాఖ్య రాష్ట్ర కార్యాలయంలో గురువారం తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర 3వ మహాసభల గోడ పత్రికను కూనంనేని సాంబశివ రావు ఆవిష్కరించి మాట్లాడుతూ ఆదివాసీ, గిరిజన, ఏజెన్సీ ప్రాంతాలు సమగ్ర అభివృద్ధికి నోచుకోలేదని, ఆయా ప్రాంతాల అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం గిరిజన హక్కులను కాలరాస్తోందని, రాష్ట్ర ప్రభుత్వాలు అణిచివేస్తున్నాయని,గిరిజన, ఆదివాసీల హక్కులను పరిరక్షించడం కోసం ఉద్యమించాలని కూనంనేని సాంబశివ రావు పిలుపునిచ్చారు. రమావత్ అంజయ నాయక్ మాట్లాడుతూ 2026 జులై 18, 19 తేదీలలో రెండు రోజుల పటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలో తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర 3 వ మహాసభలు జరుగుతాయని, రాష్ట్రంలోని 33 జిల్లాలనుండి దాదాపు 800 ప్రతినిధులు పాల్గొంటారని, మొదటిరోజు భారీ ప్రదర్శన అనంతరం ప్రతినిధుల సభ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జరుగుతుందని, ఈ మహాసభలను విజయవంతం చేయాలనీ రమావత్ అంజయ నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జువారి రమేష్,నాయకులూ వడిత్య స్వరూప,నేనావత్ రూప్ సింగ్,సక్రు నాయక్,శీను నాయక్,వడత్యా దసురు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ శృంగేరి శంకర మఠం వార్షికోత్సవాలు






**నాగోల్,జులై,2 (ప్రజావినికిడి):** శ్రీ శృంగేరి శారద శంకర మఠం అల్కాపురి లో 19వ వార్షికోత్సవ ఉత్సవాలు జూన్ 30 నుండి జులై,2 వరకు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. గురువారం చివరి రోజు శ్రీ శారదా దేవి అమ్మవారికి, చంద్రమౌళి స్వామి కి,సీతారామచంద్ర స్వాములకు, దత్తాత్రేయునికి పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. శారద అమ్మవారికి,లక్ష పుష్పార్చన, సహస్ర కమలాల తో కమలార్చన నిర్వహించారు. అలాగే కలశాభిషేకము, దీంతో పాటు చండీ హోమం నిర్వహించారు. అనంతరం సాయంత్రం కచేరి సాంస్కృతిక కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం శ్రీ శంకరమఠ నిర్వహణ అధ్యక్షులు కళా ప్రపూర్ణ విశ్వనాథ శోభనాద్రి వారు రచించిన జగన్మాత కథలు పుస్తకావిష్కరణను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకులు, నేమాని పార్థసారథి ఆలయ నిర్వాహకులు, అర్చకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రాక్టీస్ ప్రారంభించిన విరాట్ కోహ్లీ



గాయం కారణంగా ఆఫ్ఘనిస్థాన్ సిరీస్‌కు దూరమైన విరాట్ కోహ్లీ.. జూలై 14 నుంచి ప్రారంభం కానున్న ఇంగ్లాండ్ వన్డే సిరీస్‌కు సిద్ధమవుతున్నాడు. మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్‌తో కలిసి కోహ్లీ ప్రాక్టీస్ చేస్తున్న వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అయితే, అతడు పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తేనే బరిలోకి దిగుతాడని బీసీసీఐ పేర్కొంది. ఈ 3 మ్యాచ్‌ల సిరీస్‌కు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా.. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి వచ్చాడు. గాయం కారణంగా అఫ్ఘానిస్థాన్‌తో వన్డే సిరీస్‌కు దూరమైన టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ .. ఇంగ్లాండ్‌తో సిరీస్‌కు సిద్ధం అవుతున్నాడు. జులై 14 నుంచి జరగనున్న ఈ సిరీస్ కోసం ఇప్పటికే భారత జట్టును ప్రకటించింది బీసీసీఐ. ఈ జట్టులో విరాట్ కోహ్లీకి సైతం చోటు దక్కింది. అయితే పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తేనే అతడు బరిలోకి దిగుతాడని కండిషన్ పెట్టింది. ఈ నేపథ్యంలో విరాట్ కోహ్లీ.. ఫిట్‌నెస్‌పై ఫోకస్ చేశాడు. గ్రౌండ్‌లోకి అడుగుపెట్టాడు.భారత మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్‌తో కలిసి విరాట్ ప్రాక్టీస్ ప్రారంభించాడు. ఇందుకు సంబంధించిన ఫొటో, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇది చూసిన అభిమానులు.. కింగ్ వచ్చేస్తున్నాడు అని కామెంట్లు చేస్తున్నారు. కోహ్లీ రీఎంట్రీ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నట్లు పేర్కొంటున్నారు. టెస్ట్, టీ20లకు గుడ్‌బై చెప్పిన విరాట్ కోహ్లీ.. ప్రస్తుతం కేవలం 50 ఓవర్ల క్రికెట్ ఫార్మాట్‌లోనే కొనసాగుతున్నాడు. వన్డే ప్రపంచకప్ 2027లో కచ్చితంగా ఆడాలని పట్టుదలతో ముందుకెళుతున్నాడు. దీంతో అతడు ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో ఎలాంటి ప్రదర్శన చేస్తాడనేది ఆసక్తికరంగా మారింది. రోహిత్ శర్మ సైతం వన్డే ప్రపంచకప్‌లో ఆడాలంటే.. ఇంగ్లాండ్ గడ్డపై సత్తాచాటడం ముఖ్యం. ఇక ఈ సిరీస్ కోసం ఎంపిక చేసిన జట్టులో స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు చోటు దక్కలేదు. కానీ కాస్త విరామం తర్వాత జస్‌ప్రీత్ బుమ్రా.. తిరిగి జట్టులోకి వచ్చాడు.

# సెప్టెంబర్‌లో బంగ్లాదేశ్ పర్యటనకు భారత్..



ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో రద్దయిన భారత్ బంగ్లాదేశ్ ద్వైపాక్షిక సిరీస్‌లను తిరిగి నిర్వహిస్తామని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ) ప్రకటించింది. బీసీసీఐతో విభేదాలు తలెత్తినప్పటికీ సెప్టెంబర్‌లో మూడు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌లకు ఆతిథ్యం ఇస్తామని ధీమా వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన దాడులను నిరసిస్తూ ఆ దేశ ఆటగాళ్లను ఐపీఎల్ నుంచి తొలగించాలని భారత్‌లో పెద్ద ఎత్తున నిరసనలు వచ్చాయి. ఈ నిరసనలకు తలొగ్గిన బీసీసీఐ.. కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు నుంచి ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను తొలగించాలని ఆ ఫ్రాంచైజీని ఆదేశించింది. ఈ నిర్ణయాన్ని తప్పుబట్టిన బంగ్లాదేశ్ ప్రభుత్వం.. భారత్‌తో కయ్యానికి కాలు దువ్వింది.ఇదే సందు అని భావించిన పాకిస్థాన్.. బంగ్లాదేశ్‌ను రెచ్చగొట్టింది. దాంతో భారత్, బంగ్లాదేశ్ మధ్య క్రికెట్ సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. భద్రతా కారణాలను చూపుతూ.. భారత్ వేదికగా జరిగిన ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీని కూడా బీసీబీ బహిష్కరించింది. దాంతో బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్ బరిలోకి దిగింది. అయితే బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారడంతో మళ్లీ ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడుతున్నాయి. ఈ క్రమంలోనే గతేడాది వాయిదా పడిన ద్వైపాక్షిక సిరీస్‌లను ఈ ఏడాది సెప్టెంబర్‌లో నిర్వహించేందుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ప్రయత్నాలు చేస్తుంది. ఈ విషయంపై బీసీబీ మీడియా కమిటీ ఛైర్మన్ ఆసిఫ్ రబ్బానీ మాట్లాడుతూ.. 'మేం ప్లాన్ ప్రకారం భారత్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లను నిర్వహిస్తాం. భారత్‌తో సహా ఇతర ద్వైపాక్షిక సిరీస్‌ల మీడియా హక్కుల అమ్మకం కోసం మేం టెండర్ జారీ చేశాం. ఈ వేలంలో మంచి స్పందన వస్తుందని మేం ఆశిస్తున్నాం. భారత్‌తో సిరీస్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి అందరికీ తెలుసు. ద్వైపాక్షిక సిరీస్‌ల విషయంలో బీసీసీఐ నుంచి సాను కూలమైన సంకేతాలు ఉన్నాయి.'అని తెలిపారు. బీసీబీ గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. ఆగస్ట్ 28న భారత జట్టు బంగ్లాదేశ్‌కు చేరుకుంటుంది. మూడు వన్డేల సిరీస్ సెప్టెంబర్ 1,3,6 తేదీల్లో జరగను ండ గా.. సెప్టెంబర్ 9, 12, 13 తేదీల్లో మూడు టీ20ల సిరీస్ జరగాల్సి ఉంది. వాస్తవానికి ఈ సిరీస్‌ల ను 2025 ఆగస్ట్ సెప్టెంబర్‌లో నిర్వహించాలని నిర్ణ యిం చారు. అయితే ఇరు జట్ల బోర్డుల అంగీకా రంతో.. ఈ సిరీస్‌ను 2026 సెప్టెంబర్‌కు వాయిదా వేశారు. అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు, ఇరు జట్ల షెడ్యూళ్లను దృష్టిలో ఉంచుకొనిఈ నిర్ణయం తీసుకు న్నట్లు రెండు బోర్డులు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి.

# ఇషాన్ కిషన్ సరికొత్త హిస్టరీ క్రియేట్



ఐసీసీ బుధవారం రిలీజ్ చేసిన లేటెస్ట్ ప్లేయర్ ర్యాంకింగ్స్ లో ఇండియా వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ సరికొత్త హిస్టరీ క్రియేట్ చేశాడు. తన టీమ్‌మేట్ అభిషేక్ శర్మను వెనక్కి నెట్టి వరల్డ్ నంబర్ వన్ టీ20 బ్యాటర్‌గా టాప్ ప్లేస్ లో సెటిల్ అయ్యాడు. దాదాపు ఏడాది కాలంగా నంబర్ వన్ సీటులో కొనసాగుతున్న అభిషేక్ శర్మకు కిషన్ చెక్ పెట్టాడు. ఐర్లాండ్‌తో బెల్ఫాస్ట్‌లో జరిగిన సిరీస్ లో ఇండియా 0-2 తో ఓడిపోయినప్పటికీ, అంతకుముందు టీ20 వరల్డ్ కప్ లో కిషన్ చూపించిన మెరుపు పర్ఫార్మెన్స్ అతనికి ఈ కెరీర్ బెస్ట్ రేటింగ్‌ను తెచ్చిపెట్టింది. వరల్డ్ కప్ లో కిషన్ ఏకంగా 200 కి పైగా మైండ్ బ్లోయింగ్ స్ట్రైక్ రేట్‌తో 317 రన్స్ స్కోర్ చేశాడు. ఇందులో కొలంబోలో పాకిస్తాన్‌పై ఆడిన మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ కూడా ఉంది. ప్రెజెంట్ అభిషేక్ శర్మ కంటే కిషన్ కేవలం ఏడు రేటింగ్ పాయింట్ల లీడ్ లో ఉన్నాడు. ఇండియా తరఫున విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్ ల తర్వాత టీ20 ర్యాంకింగ్స్ లో నంబర్ వన్ ప్లేస్ సాధించిన ఫోర్త్ ఇండియన్ మెన్స్ బ్యాటర్‌గా కిషన్ ఒక ఎలైట్ క్లబ్ లో జాయిన్ అయ్యాడు. ఇండియాపై సిరీస్ విక్టరీ కొట్టిన ఐర్లాండ్ ప్లేయర్లకు కూడా ఈ ర్యాంకింగ్స్ లో మంచి లాభం చేకూరింది. ఐరిష్ కెప్టెన్ లార్కాన్ టక్కర్ నాలుగు ప్లేసెస్ జంప్ చేసి 77వ స్థానానికి చేరగా, ఓపెనర్ రాస్ అడైర్ ఆరు స్థానాలు ఎగబాకి 84వ ర్యాంక్ అందుకున్నాడు. బౌలింగ్ విభాగంలో ఇండియా సిరీస్ లో 4 వికెట్లు తీసిన ఐర్లాండ్ సీమర్ మాథ్యూ హంఫ్రీస్ కెరీర్ బెస్ట్ రేటింగ్ తో 25వ స్థానానికి చేరుకున్నాడు. టీ20 ఆల్‌రౌండర్ల లిస్టులో ఇండియా ప్లేయర్ శివం దూబే మూడు స్థానాలు ఇంప్రూవ్ చేసుకుని సెవెంత్ ప్లేస్ లో నిలవగా, ఐర్లాండ్ ప్లేయర్లు గారెత్ డెలానీ 24వ ర్యాంక్ కు, హ్యారీ టెక్టర్ 38వ ర్యాంక్ కు దూసుకొచ్చారు. టీ20లే కాకుండా ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ లోనూ ఒక మేజర్ చేంజ్ జరిగింది. ఆస్ట్రేలియా పవర్‌ఫుల్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ తన కెరీర్ లోనే ఫస్ట్ టైమ్ వరల్డ్ నంబర్ వన్ టెస్ట్ బ్యాటర్‌గా హిస్టారికల్ రికార్డ్ క్రియేట్ చేశాడు. నాటింగ్‌హామ్‌లో న్యూజిలాండ్ తో జరిగిన టెస్ట్ మ్యాచ్ లో ఇంగ్లాండ్ బ్యాటర్లు హ్యారీ బ్రూక్, జో రూట్ దారుణంగా ఫెయిల్ అవ్వడం వల్ల ట్రావిస్ హెడ్‌కు ఈ లక్కీ ఛాన్స్ దక్కింది. అంతకుముందు టాప్ లో ఉన్న హ్యారీ బ్రూక్ సెకండ్ ప్లేస్ కు పడిపోగా, జో రూట్ రెండు స్థానాలు కోల్పోయి థర్డ్ ర్యాంక్ లో సెటిల్ అయ్యాడు. ట్రెంట్ బ్రిడ్జ్ టెస్ట్ మ్యాచ్ లో ఇంగ్లాండ్ పై న్యూజిలాండ్ సాధించిన బిగ్ విక్టరీ వల్ల కివీస్ బ్యాటర్ రచిన్ రవీంద్ర సెవెంత్ ప్లేస్ కు, డారిల్ మిచెల్ 11వ స్థానానికి, డెవాన్ కాన్వే ఏకంగా 14 స్థానాలు ఎగబాకి 15వ ర్యాంక్ కు దూసుకెళ్లారు. టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్ లో ఇండియా ఏస్ పేస్ స్టార్ జస్‌ప్రీత్ బుమ్రా మళ్లీ తన కింగ్ సైజ్ పొజిషన్ ను దక్కించుకున్నాడు. న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ మాట్ హెన్రీ సెండ్ ప్లేస్ కు పడిపోవడంతో బుమ్రా ఒంటరిగా నంబర్ వన్ టెస్ట్ బౌలర్‌గా నిలిచాడు. కాగా మ్యాచ్ మధ్యలోనే ఇంటర్నేషనల్ క్రికెట్ కు రిటైర్మెంట్ అనౌన్స్ చేసిన ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ రెండు స్థానాలు ఇంప్రూవ్ చేసుకుని టెస్ట్ ఆల్‌రౌండర్లలో థర్డ్ ప్లేస్ తో తన కెరీర్ ను ఎండ్ చేశాడు. మరోవైపు యాంటిగ్వాలో శ్రీలంకపై వెస్టిండీస్ సాధించిన సంచలన విజయం వల్ల వారి స్పీడ్‌స్టర్స్ షమర్ జోసెఫ్ 14వ స్థానానికి, కెమర్ రోచ్ 17వ స్థానానికి చేరారు.

# భారత్, ఇంగ్లాండ్ తొలి టీ20 మ్యాచ్ వర్షార్పణం

**- 189 పరుగుల భారీ స్కోరు చేసిన భారత్**



భారత్, ఇంగ్లాండ్ మధ్య జరగాల్సిన తొలి టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. చెస్టర్ లీ స్ట్రీట్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా.. అభిషేక్ శర్మ (59), శ్రేయస్ అయ్యర్ (68) హాఫ్ సెంచరీలతో 189 పరుగుల భారీ స్కోరు చేసింది. అయితే భారత్ ఇన్నింగ్స్ ముగిసిన వెంటనే వర్షం తీవ్రం కావడంతో ఇంగ్లాండ్ బ్యాటింగ్‌కు వీలుపడలేదు. అంపైర్లు డీఎల్ఎస్ పద్ధతిలో ఓవర్లను కుదించినా వర్షం తగ్గకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేశారు.ఐర్లాండ్‌తో సిరీస్‌లో తేలిపోయిన భారత బ్యాటర్లు.. వేదిక మారగానే సత్తాచాటారు. ముఖ్యంగా అభిషేక్ శర్మ 24 బంతుల్లో 59 రన్స్ బ్యాట్ ఝుళిపించాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (47 బంతుల్లో 68 రన్స్) సైతం ఫర్వాలేదనిపించాడు. చివర్లో శివమ్ దూబె (21 బంతుల్లో 42 రన్స్) మంచి ఫినిషింగ్ ఇచ్చాడు. దీంతో 7 వికెట్ల నష్టానికి టీమిండియా 189 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ బౌలర్లలో సాకిబ్ మహమూద్ 3 వికెట్లు తీశాడు. ఆదిల్ రషీద్, సామ్ కర్రన్ ఒక్కో వికెట్ పడగొట్టారు. నిజానికి ఈ మ్యాచ్ ప్రారంభం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. కానీ ఆటకు అంతరాయం కలిగేంత కాదు. ఆ చిరు జల్లుల మధ్య భారత బ్యాటింగ్ కొనసాగించారు. కానీ ఇన్నింగ్స్ తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వర్షం ఎక్కువ కావడంతో ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్‌కే పరిమితమయ్యారు. వర్షం తగ్గితే మ్యాచ్ నిర్వహించేందుకు అంపైర్లు ప్రయత్నించారు. అందుకోసం ఇంగ్లాండ్ లక్ష్యాన్ని సవరించారు. కానీ వర్షం తగ్గకపోవడంతో మ్యాచ్ నిర్వహణ సాధ్యం కాలేదు. మరోవైపు చెస్టర్ లీ స్ట్రీట్ వేదికగా భారత్ ఆడిన మూడు మ్యాచులు ఫలితం రాకుండానే ముగియడం గమనార్హం. 2002, 2011లో ఇంగ్లాండ్‌తో జరగాల్సిన వన్డే మ్యాచులలో ఫలితం రాలేదు. వర్షం కారణంగా ఆ మ్యాచులు రద్దు చేశారు. తాజా సిరీస్‌లో తొలి టీ20 మ్యాచ్ కూడా వర్షార్పణ అయింది. ఈ సిరీస్‌లో భాగంగా రెండో మ్యాచ్ జులై 4న జరగనుంది.టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 6 పరుగులకే శాంసన్, ఇషాన్ వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో ఓపెనర్ అభిషేక్ శర్మ (24 బంతుల్లో 59) మెరుపు హాఫ్ సెంచరీతో ఇంగ్లాండ్ బౌలర్లపై విరుచుకుపడగా.. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (68) బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడాడు. ఆఖర్లో శివమ్ దూబె (42లి) రాణించడంతో భారత్ భారీ స్కోరును నమోదు చేసింది.ఇంగ్లాండ్‌తో జరుగుతున్న తొలి టీ20 మ్యాచులో భారత జట్టు భారీ స్కోరు చేసింది. చెస్టర్ లీ స్ట్రీట్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచులో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నాడు. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెడుతూ బ్యాటర్లు రాణించారు. ఓపెనర్ అభిషేక్ శర్మ .. ఇంగ్లాండ్ బౌలర్లను షేక్ చేశాడు. శ్రేయస్ అయ్యర్ కూడా హాఫ్ సెంచరీ చేయడంతో భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 189 పరుగులు స్కోరు చేసింది. సంజూ శాంసన్.. వరుసగా మూడో మ్యాచులో విఫలమయ్యాడు. ఏడు బంతుల్లో ఒక పరుగు మాత్రమే చేసి పెవిలియన్ చేరిపోయాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్.. రనౌట్ అయ్యాడు. 2 బంతుల్లో ఒక్క పరుగు కూడా చేయకుండానే నిష్క్రమించాడు. దీంతో భారత్.. 6 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. కానీ ఈ సమయంలో అభిషేక్ శర్మ అదరగొట్టాడు. తనదైన శైలిలో బ్యాట్ ఝుళిపించాడు. 20 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసిన అభిషేక్ శర్మ.. మొత్తంగా 24 బంతుల్లో 59 రన్స్ చేసి ఔట్ అయ్యాడు. ఇందులో 4 సిక్సులు, ఆరు ఫోర్లు ఉన్నాయి. ఇక కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 47 బంతుల్లో 68 పరుగులు చేశాడు. చివర్లో శివమ్ దూబె ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. 21 బంతుల్లో 42 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో నిర్ణీత 20 ఓవర్లలో టీమిండియా 7 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది.



# సెనెగల్‌పై బెల్జియం సంచలన విజయం

ఫిఫా ప్రపంచకప్ 2026లో భాగంగా జరిగిన రౌండ్ ఆఫ్ 32 నాకౌట్ మ్యాచ్‌లో బెల్జియం అద్భుత విజయం సాధించింది. సెనెగల్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో ఒకానొక దశలో 0-2తో వెనుకబడిన బెల్జియం, అనూహ్యంగా పుంజుకుని 3-2 తేడాతో గెలిచి అందరినీ ఆశ్చర్యపర్చింది. మ్యాచ్ ముగియడానికి కొన్ని క్షణాల ముందు యూరి టైల్‌మన్స్ పెనాల్టీని గోల్‌గా మలిచి బెల్జియంకు అపురూప విజయాన్ని అందించాడు. ఈ గెలుపుతో బెల్జియం ప్రి-క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. సెనెగల్ జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించింది. అంతర్జాతీయ ఫుట్‌బాల్ హిస్టరీలో బెల్జియం, సెనెగల్ జట్లు తలపడటం ఇదే మొదటిసారి. మ్యాచ్ ప్రారంభమైన కొద్దిసేపటికే బెల్జియం తరఫున లియాండ్రో ట్రోసార్డ్ గోల్ చేయడానికి ప్రయత్నించినప్పటికీ, ఆ తర్వాత పూర్తి ఆధిపత్యం సెనెగల్‌దే అయ్యింది. 'లయన్స్ ఆఫ్ టెరంగో'గా పిలవబడే సెనెగల్ ఆటగాళ్లు మైదానంలో చిరుతల్లా కదిలారు. దిగ్గజ ఆటగాడు సాడియో మానే పెనాల్టీ బాక్స్ వైపు ఒక అద్భుతమైన క్రాస్ పాస్ అందించాడు. దీనిని అందుకున్న ఇస్మాయిలా గోల్ చేయడానికి ప్రయత్నించగా, బంతి పోస్ట్‌కి తగిలి రీబౌండ్ అయింది. అయితే, అక్కడే అప్రమత్తంగా ఉన్న సెనెగల్ యువ మిడ్‌ఫీల్డర్ హబీబ్ దియారా ఆ రీబౌండ్ బంతిని ఏమాత్రం ఆలస్యం చేయకుండా గోల్ పోస్ట్‌లోకి నెట్టాడు. దీంతో మ్యాచ్ మొదటి అర్ధభాగంలో సెనెగల్ 1-0 ఆధిక్యాన్ని సంపాదించింది. సెకండాఫ్ ప్రారంభమైన వెంటనే బెల్జియం కోలుకుంటుందని భావించిన అభిమానులకు సెనెగల్ మళ్లీ షాక్ ఇచ్చింది. సెకండాఫ్ మొదలైన కేవలం ఆరు నిమిషాలకే లాంగ్ బాల్‌ను ఇస్మాయిలా అద్భుతంగా అందుకున్నాడు.

# హార్దిక్ పాండ్యాతో సీఎస్కే ట్రేడ్ డీల్ జరగలేదు

**• సీఎస్‌కే సీఈవో కాశీ విశ్వనాథన్ వెల్లడి**



ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా చెన్నై సూపర్ కింగ్స్‌లో చేరుతున్నాడనే ప్రచారానికి సీఎస్‌కే సీఈవో కాశీ విశ్వనాథన్ బ్రేక్ వేశారు. హార్దిక్ ట్రేడింగ్‌పై తమ ఫ్రాంచైజీలో ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్ ముగిసిన తర్వాతే.. ఐపీఎల్ 2026 ప్రదర్శనపై రివ్యూ నిర్వహించి, ఐపీఎల్ 2027 ట్రేడ్‌లపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. దీంతో హార్దిక్ ట్రేడ్‌పై ఊహాగానాలకు చెక్ పడ్డట్లయింది. ఐపీఎల్ 2026 ముగిసినప్పటి నుంచి సోషల్ మీడియాలో హార్దిక్ పాండ్యా చర్చనీయాంశంగా మారిపోయాడు. మూడేళ్ల క్రితం ముంబై ఇండియన్స్‌లోకి కెప్టెన్‌గా రీఎంట్రీ ఇచ్చిన అతడు.. ఆశించిన ఫలితాలు అందుకోలేకపోయాడు. ఈ మూడు సీజన్లలో ముంబై రెండు సార్లు లీగ్ స్టేజ్‌కే పరిమితమైంది. దానికి తోడు జట్టులో అతడు ఒంటరి అయ్యాడని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో హార్దిక్ పాండ్యా వచ్చే ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ముంబైని వీడతాడని జోరుగా వార్తలు వస్తున్నాయి.ఇటీవల ఈ వార్తలు మరింత పెరిగాయి. ట్రేడ్ విండోలో అతడిని దక్కించుకునేందుకు ఫ్రాంఛైజీలు పోటీ పడుతున్నాయని సమాచారం. తాజాగా చెన్నై సూపర్ కింగ్స్ సైతం అతడి కోసం ప్రయత్నిస్తోందని వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలపై చెన్నై సూపర్ కింగ్స్ సీఈవో కాశీ విశ్వనాథన్ స్పందించారు. హార్దిక్ పాండ్యాను ట్రేడ్ ద్వారా జట్టులోకి తీసుకురావడంపై ఇప్పటివరకు చర్చలు జరగలేదని స్పష్టం చేశారు."హార్దిక్ పాండ్యా ట్రేడ్ విషయంపై ఇప్పటివరకు మా ఫ్రాంచైజీ చెన్నై సూపర్ కింగ్స్‌లో ఎలాంటి చర్చ జరగలేదు. ఐపీఎల్ 2026పై రివ్యూ మీటింగ్ జరిగిన తర్వాతే.. ట్రేడ్‌లపై నిర్ణయాలు తీసుకుంటాం. మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ) ముగిసిన తర్వాత ఐపీఎల్ 2026పై రివ్యూ ఉంటుంది" అని కాశీ విశ్వనాథన్ వెల్లడించారు. దీంతో చెన్నై సూపర్ కింగ్స్‌లో హార్దిక్ పాండ్యా వెళ్లడం దాదాపుగా ఖరారైందని వార్తలకు చెక్ పడినట్లయింది. ఇక మేజర్ లీగ్ క్రికెట్ ప్రస్తుతం అమెరికాలో జరుగుతోంది. జులై 18 వరకు ఈ లీగ్ జరగనుంది. ఇందులో సీఎస్‌కే అనుబంధ జట్టైన టెక్సాస్ సూపర్ కింగ్స్ కూడా పాల్గొంటోంది. అందుకే ఎంఎల్‌సీ ముగిసిన తర్వాతే ఐపీఎల్ 2027 సీజన్‌పై పూర్తి సమీక్ష నిర్వహించి, ట్రేడ్‌లపై నిర్ణయం తీసుకోనున్నట్లు సీఎస్‌కే యాజమాన్యం స్పష్టం చేసింది. మరోవైపు హార్దిక్ పాండ్యా కోసం ఏడు ఫ్రాంఛైజీలు పోటీ పడుతున్నట్లు సమాచారం. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్ రైజర్స్ హైదరాబాద్ మినహా.. మిగతా ఫ్రాంఛైజీలు అతడిని దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయట!

# ధృవ్ విక్రమ్‌తో మైత్రీ మూవీస్ చిత్రం ప్రారంభం

ఇటీవల బైసన్‌తో మెప్పించిన కోలీవుడ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్ కుమారుడు, యువ సంచలనం ధ్రువ్ విక్రమ్ కథానాయకుడిగా మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఒక సరికొత్త చిత్రాన్ని ప్రకటించింది. ధ్రువ్ విక్రమ్ కెరీర్‌లో నాలుగో సినిమాగా వర్కింగ్ టైటిల్స్‌తో రూపొందుతున్న ఈ భారీ చిత్రం చెన్నైలో చిత్ర యూనిట్ సభ్యులు, పలువురు సినీ ప్రముఖుల సమక్షంలో పూజా కార్యక్రమాలతో అత్యంత ఘనంగా ప్రారంభమైంది. ధ్రువ్ విక్రమ్ కెరీర్‌లోనే ఇప్పటివరకు రాని ఒక డిఫరెంట్ జోనర్‌లో, అవుట్ అండ్ అవుట్ పక్కా కమర్షియల్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని మలిచేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు డైరెక్టర్ కరణ్ ఎ. కుమార్ దర్శకత్వం వహిస్తుండగా, ఆయనతో పాటు రైటర్ శబీ సంయుక్తంగా ఈ చిత్రానికి స్క్రిప్ట్‌ను మరియు డైలాగ్స్‌ను అందిస్తున్నారు. కేవలం కథానాయకుడి పాత్రే కాకుండా సినిమాలో మిగిలిన పాత్రలు కూడా చాలా బలంగా ఉంటాయని, ఈ నేపథ్యంలోనే చిత్రంలో కీలక పాత్రల కోసం ప్రముఖ నటుడు పృథ్వీరాజ్ మరియు యాక్టర్ సాయి దీనలను ఎంపిక చేసినట్లు చిత్రబృందం వెల్లడించింది. విక్కీ సినిమాటోగ్రాఫర్‌గా విజువల్స్ అందిస్తుండగా, చియాన్ ఎడిటర్‌గా, జి.ఎమ్. శేఖర్ ప్రొడక్షన్ డిజైనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇందులో హై-వోల్టేజ్ యాక్షన్ ఎపిసోడ్స్ డిజైన్ చేయడం కోసం ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్ వి.ఎమ్. మోర్‌ను రంగంలోకి దించారు. ఈ పూజా కార్యక్రమాలతోనే సినిమా రెగ్యులర్ షూటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు కూడా శరవేగంగా జరుగుతున్నాయని, రాబోయే రోజుల్లో ఈ సినిమాకు సంబంధించిన పూర్తి తారాగణం, హీరోయిన్ మరియు టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా వెల్లడిస్తారని సమాచారం.




# దసరాకు విశ్వంభర

## సన్నాహాలు చేస్తోన్న చిత్రబృందం

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ సోషియో-ఫాంటసీ అడ్వెంచర్ మూవీ 'విశ్వంభర' విడుదలపై ఎట్టకేలకు ఒక స్పష్టత వచ్చేసినట్లు తెలుస్తుంది. ఈ భారీ బ్జడెట్ విజువల్ వండర్ సినిమాను రాబోయే దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది. చిరంజీవి ఎపిక్ ఫాంటసీ 'విశ్వంభర' దసరా పండుగ కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వస్తోంది అంటూ పలువురు మీడియా, సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా పోస్ట్‌లు పెట్టడంతో దసరా రాబోతుండటం పక్కా అని తెలుస్తుంది. బ్లాక్‌బస్టర్ హిట్ 'బింబిసార' చిత్ర దర్శకుడు వశిష్ట ఈ సినిమాను ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ యువి క్రియేషన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. గతంలోనే ఈ సినిమా షూటింగ్ పూర్తయినప్పటికీ, అత్యుత్తమ అవుట్‌పుట్ కోసం భారీ విజువల్ ఎఫెక్ట్స్ మరియు గ్రాఫిక్స్ పనులపై చిత్రయూనిట్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. 'అంజి', 'జగదేకవీరుడు అతిలోకసుందరి' చిత్రాల తర్వాత చిరంజీవి నుండి వస్తున్న పూర్తి స్థాయి సోషియో-ఫాంటసీ సినిమా కావడంతో ఈ దసరాకు బాక్సాఫీస్ వద్ద మెగాస్టార్ సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.




# 10న వస్తున్న లఖిల్ లెనిన్

## గ్యాప్ తరవాత విజయం కోసం ఎదురుచూపు



'లెనిన్'తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు నటుడు అఖిల్. మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జులై 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాను మూడేళ్లు విరామం తీసుకోవడానికి గల కారణాన్ని అఖిల్ వివరించారు. ఏజెంట్' సినిమా విడుదలైన మూడు నెలలకు నేను ప్రమాదవశాత్తు బాత్రూంలో పడ్డాను. గాజు ముక్కలు నా చేతికి బలంగా గుచ్చుకున్నాయి. ఎడమ చేతి వేళ్లకు రెండు శస్త్రచికిత్సలు జరిగాయి. 48 కుట్లు పడ్డాయి. 8 నెలల పాటు బరువులు ఎత్తలేకపోయాను. ఆ గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి 16 నెలలు పట్టింది. మూడేళ్లు విరామం తీసుకున్నందుకు నా అభిమానులు నాపై కోపంగా ఉన్నారు. ఇలా మరోసారి జరగదని వాళ్లకు నేను హామీ ఇస్తున్నాను అని అఖిల్ చెప్పారు. లెనిన్ చిత్రం గురించి మాట్లాడుతూ.. కథ వినగానే కొత్త అనుభూతి కలిగిందన్నారు. పాత్రల్లోని విభిన్న కోణాలు ఆశ్చర్యపరిచాయని తెలిపారు. ఇలాంటి కథే కాదు.. ఈ అంశంమీద ఒక్క సినిమా కూడా రాలేదని పేర్కొన్నారు. అందుకే ఇలాంటి సినిమాతోనే కమ్‌బ్యాక్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.

# జైలర్-2 షూటింగ్ పూర్తి

## ప్రత్యేక పాత్రలో హృతిక రోషన్




మాఫియా, ప్రతీకార నేపథ్యం, కుటుంబ అంశాల మేళవింపుగా రూపొంది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న చిత్రం 'జైలర్'. అగ్ర కథానాయకుడు రజనీకాంత్ ప్రధాన పాత్రలో నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన ఈ చిత్రానికి సీక్వెల్ రానున్న విషయం తెలిసిందే. తాజాగా 'జైలర్ 2' షూటింగ్ పూర్తయినట్లు టీమ్ తెలిపింది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని వెల్లడించింది. నిజానికి ఈ సినిమా చిత్రీకరణ ఈ ఏడాది ఏప్రిల్‌లోనే పూర్తయింది. కానీ, నెల్సన్ ఈ కథలో మరికొన్ని కొత్త సన్నివేశాలు యాడ్ చేసి 25 రోజుల పాటు మళ్లీ షూటింగ్ నిర్వహించారు. తాజాగా అవి కూడా పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది.ఈ చిత్రంలో హృతిక్ రోషన్ అతిథి పాత్రలో నటిస్తున్నట్లు ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. ఇటీవల ఆయన చెన్నై రావడంతో ఆ వార్తలకు మరింత బలం చేకూరింది. ఈ 25 రోజుల షెడ్యూల్‌లో ఆయనకు సంబంధించిన సన్నివేశాలనే చిత్రీకరించారని సమాచారం. ఈ ఏడాది సెప్టెంబర్‌లో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. 'జైలర్'లో పలు భాషలకు చెందిన అగ్రతారలు అతిథి పాత్రల్లో మెరిసిన విషయం తెలిసిందే. రెండో భాగంలోనూ ఆ సందడి కొనసాగనుంది. సీనియర్ నటుడు మిథున్ చక్రవర్తి కూడా ఇందులో కీలకపాత్రలో కనిపించనున్నారు. మొదటి భాగం ఎక్కడ ఆగిపోయిందో అక్కడి నుంచే సీక్వెల్ ప్రారంభమవుతుందని గతంలో శివరాజ్ కుమార్ తెలిపారు.

-------

# ఫ్రాన్స్‌లో రాజమౌళికి అరుదైన గౌరవం...


## 'వాల్ ఆఫ్ ఫిల్మ్‌మేకర్స్'పై జక్కన్న పేరు




ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళికి అంతర్జాతీయ స్థాయిలో మరో అరుదైన గౌరవం దక్కింది. చలనచిత్ర రంగానికి పురిటిగడ్డగా భావించే ఫ్రాన్స్‌లోని లయోన్‌లో ఉన్న ప్రతిష్ఠాత్మక 'ఇన్‌స్టిట్యూట్ లుమియర్' ఆయన్ను ఘనంగా సత్కరించింది. అక్కడి ప్రఖ్యాత 'వాల్ ఆఫ్ ఫిల్మ్‌మేకర్స్' పై రాజమౌళి పేరుతో శాశ్వత స్మారక ఫలకాన్ని ప్రతిష్ఠించింది. ఈ అరుదైన గౌరవం ద్వారా మార్టిన్ స్కోర్సెస్సీ, క్లింట్ ఈస్ట్‌వుడ్, క్వెంటిన్ టరంటినో, ఫ్రాన్సిస్ ఫోర్డ్ కపోలా వంటి ప్రపంచ ప్రఖ్యాత దిగ్గజ దర్శకుల సరసన రాజమౌళి నిలిచారు.

జూలై 1, 2 తేదీల్లో జరిగిన ఈ వేడుక అనంతరం రాజమౌళి తన అనుభూతులను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. "లుమియర్ మ్యూజియంను సందర్శించాను. నా సినిమాలు 'ఈగ', 'ఆర్‌ఆర్‌ఆర్' ప్రదర్శితమవుతున్న స్క్రీనింగ్ రూమ్‌కు వెళ్ళిన సమయంలో ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ థియరీ ఫ్రెమాక్స్ నన్ను అక్కడి ప్రేక్షకులకు పరిచయం చేసి, ఒక సర్ ప్రైజ్ ఉందని చెప్పారు. నన్ను సినిమా పుట్టిన వీధిలోకి తీసుకెళ్లగా, అక్కడ ప్రపంచ ప్రఖ్యాత దర్శకుల పేర్లతో కూడిన ఫలకాలు కనిపించాయి. ఎరుపు రంగు వస్త్రంతో కప్పి ఉన్న ఒక ఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. దానిపై నా పేరు చూసి ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యాను. ఈ అరుదైన గౌరవానికి వినమ్రంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను" అని రాజమౌళి వివరించారు.ఇటీవలే పారిస్‌లోని 'సినీమాథెక్ ఫ్రాన్సైస్' థియేటర్‌లో రాజమౌళి పేరుతో ఒక శాశ్వత సీటును కేటాయించిన సంగతి తెలిసిందే. తాజా గౌరవంతో ఆయన అంతర్జాతీయ ఖ్యాతి మరో మెట్టు ఎక్కింది. జూన్ చివరి వారం నుంచి జూలై మధ్య వరకు ఇన్‌స్టిట్యూట్ లుమియర్ రాజమౌళి చిత్రాలైన 'బాహుబలి', 'ఆర్‌ఆర్‌ఆర్' వంటి చిత్రాలతో ప్రత్యేక 'రెట్రోస్పెక్టివ్'ను నిర్వహిస్తోంది.

# ఇది కదా ఫ్యాన్స్ కోరుకునేది..!



ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పరిపాలన, రాజకీయాలతో ఎంత బిజీగా ఉన్నాడో తెలిసిందే. తెలుగు రాష్ట్రాల్లో తిరుగుతూ, ఢిల్లీలో మీటింగ్స్, పార్టీ కార్యక్రమాలు, మీటింగ్‌లు, అధికారులతో పర్యవేక్షణ ఇలా చెప్పుకుంటూ పోతే ఆయన ఫుల్ బిజీగా ఉంటాడు. చేతికి గాయం అయినప్పటికీ ఆపరేషన్ వాయిదా వేసుకుని మరీ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు. అంతగా బిజీగా ఉన్న పవన్ కళ్యాణ్ మళ్లీ కెమెరా ముందుకు వస్తాడని, ఆయన సినిమాల్లో నటిస్తాడని చాలా మంది అనుకోవడం లేదు. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన నుంచి వచ్చిన సినిమాలన్నీ కూడా అంతకు ముందు కమిట్ అయిన సినిమాలే అనే విషయం తెల్సిందే. అయితే ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి బిజీగా ఉన్న క్రమంలోనూ పవన్ ఒక మూవీని కమిట్ అయ్యాడని, అది 'ఓజీ 2' అంటూ ఈ మధ్య కాలంలో తెగ ప్రచారం జరుగుతోంది. ఇటీవల దర్శకుడు సుజీత్ స్వయంగా పవన్ కళ్యాణ్ ను కలిసి ఓజీ 2 గురించి చర్చించడం జరిగింది. పవన్‌కి మాత్రమే కాకుండా ఆయన ఫ్యాన్స్‌కి ఎంతగానో నచ్చిన మూవీ ఓజీ. అందుకే ఆ సినిమాకు కొనసాగింపుగా ఫ్రాంచైజీలో మూవీ చేయాలని పవన్, సుజీత్ నిర్ణయించారు. ఆ సినిమా నిర్మాణంలో పవన్ సైతం నిర్మాణ భాగస్వామి అయ్యే అవకాశం ఉంది. ఓజీ ఫ్రాంచైజీ మూవీలో ఓజీ నిర్మాత ఉండక పోవచ్చు అనే ప్రచారం జరుగుతోంది. ఆ విషయం పక్కన పెడితే ఓజీ 2 గురించిన చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఫోటో సోషల్ మీడియాలో ప్రత్యక్షం కావడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. సాధారణంగానే పవన్ కళ్యాణ్ ఫోటోలకు విపరీతమైన క్రేజ్ ఉంటుంది. ఇక మూవీ స్టిల్స్ అయితే సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో రెస్పాన్స్ ఉంటుంది. తాజాగా ఈ ఫోటో సోషల్ మీడియాలో కనిపించిన వెంటనే వైరల్ అయ్యింది.అభిమానులు, అన్ని వర్గాల వారు సోషల్ మీడియాలో పవన్ కళ్యాణ్ కు చెందిన ఈ కొత్త స్టిల్‌ను తెగ షేర్ చేశారు. నిమిషాల వ్యవధిలోనే వైరల్ అయ్యింది. ఓజీ 2 హ్యాష్ ట్యాగ్‌తో చాలా మంది ఈ ఫోటోను షేర్ చేయడంతో మళ్లీ ఓజీ సినిమా గురించిన చర్చ మొదలైంది. పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ ఏం కోరుకుంటారో దర్శకుడు సుజీత్ అది ఇస్తాడని మరోసారి ఈ ఫోటోతో నిరూపితం అయ్యింది. చాలా సింపుల్ స్టిల్‌లో పవన్ కళ్యాణ్ చూపు తిప్పలేనంతగా ఆకట్టుకుంటున్నాడని అభిమానులు అంటున్నారు. బ్లాక్ హుడీలో గడ్డంలో పవన్ కళ్యాణ్ స్టైలిష్ అవతారంలో కనిపిస్తున్నాడని అభిమానులు కామెంట్ చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ ను ఇదే లుక్‌లో దర్శకుడు సుజీత్ ఓజీ 2 లో చూపించే అవకాశం కనిపిస్తుంది. ఇదే లుక్‌తో ఓజీ 2 వస్తే కచ్చితంగా ఫ్యాన్స్ కి మరో పెద్ద పండుగ అనడంలో ఎలాంటి సందేహం లేదు అంటూ సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613